Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక




సంపుటి : 26 | సంచిక : 151 | హైదరాబాద్ | శుక్రవారం 24 ఏప్రిల్ 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



- 2లో

## మే 4న మిఠాయిలు, ఝాల్‌మురీ తినిపిస్తాం

అది తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి 'ఎక్స్‌పైరీ డేట్'

పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యం

తొలి విడతలో ఓటింగ్ ప్రజల ఆకాంక్షకు నిదర్శనం

మార్పునకు అనుకూలంగా అఖండమైన తీర్పు

బెంగాల్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

ఎన్నికల్లో తగ్గిన హింస.. ఈసీకి అభినందనలు



## మేలో నామినేటెడ్, పార్టీ పదవుల భర్తీ పూర్తి

రాహుల్‌తో భేటీ.. టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ చర్చ

హైదరాబాద్‌లో ఏఐసీసీ ఓబీసీ భేటీకి విజ్ఞప్తి

అత్యంత శాస్త్రీయంగా కులగణన సర్వే ప్రక్రియ

న్యూఢిల్లీ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎదురుచూస్తున్న నామినేటెడ్, పార్టీ సంస్థాగత పదవుల భర్తీ ప్రక్రియ మేలో పూర్తికానుందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితులు, సంస్థాగత నిర్మాణం, ప్రభుత్వ

- మిగతా 2వ పేజీలో



ఇటీవలే జగిత్యాలలో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన కేసీఆర్.. ఇప్పుడు వరంగల్ వేదికగా మరో రాజకీయ సంచలనానికి సిద్ధమవుతున్నారు. మే మొదటి వారంలో వరంగల్ 'రైతు ఆశీర్వాద సభ' ప్రస్తుతం రైతుల సమస్యలే ప్రధాన అస్త్రంగా కేసీఆర్ ముందుకు సాగుతున్నట్లు స్పష్టమవుతోంది. తాజా సమాచారం ప్రకారం.. మే మొదటి వారంలో వరంగల్‌లో బీఆర్ఎస్ భారీ ఎత్తున 'రైతు ఆశీర్వాద సభ'ను నిర్వహించనుంది. ఈ సభలో స్వయంగా కేసీఆర్ పాల్గొని, రైతులకు భరోసా ఇవ్వడంతో పాటు ప్రభుత్వ విధానాలపై మరోసారి గర్జించనున్నారు.

## ఇక.. జనంలోకి కేసీఆర్!

### జగిత్యాల సభతో ఊపు

మే 7న వరంగల్‌లో రైతు ఆశీర్వాద సభ

ఈ నెల 27న తెలంగాణ భవన్‌లో సమావేశం

కొత్త కేసీఆర్‌ను చూస్తారంటున్న పార్టీ శ్రేణులు

పార్టీ శ్రేణుల్లో జోష్ నింపుతున్న గులాబీ అధినేత

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

తెలంగాణ రాజకీయాల్లో నెలకొన్న స్థబ్ధతను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బ్రేక్ చేశారు. ఎన్నోరోజులుగా ఫాంహౌస్‌కే పరిమితం అయిన ఆయన ఇటీవల జగిత్యాల సభలో కనిపించి, పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు. ఆ సభలో ఆయన ప్రసంగానికి విశేష స్పందన కనిపించింది. గులాబీ బాస్ ఇలా జనంలోకి వస్తే ఆ కిక్కే వేరన్న లెవల్‌లో సభ జరిగింది. కాళేశ్వరం విషయంలో కోర్టులో ఆయనకు పెద్ద ఊరట లభించింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇక నుంచి జనంలో ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. తరచూ నేతలలోనే కాకుండా ప్రజల్లోకి కూడా రావాలని నిర్ణయించుకున్నారు. మొన్నటి బీఆర్ఎస్ సభతో కొత్త కేసీఆర్‌ను చూపించేందుకు రెడీ అవుతున్నారు. ఇందులో భాగంగా త్వరలోనే మరో భారీ బహిరంగ సభకు రంగం సిద్ధం చేస్తున్నారు.

బీఆర్ఎస్ ఇప్పుడు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఓ పక్క ఆయన సొంత కుమార్తె, జాగృతి అధ్యక్షురాలు కొత్త పార్టీ

- మిగతా 2వ పేజీలో



## ఎన్నికల తర్వాత ఇంధన షాక్?

భారీగా పెరగనున్న పెట్రో ధరలు

యుద్ధం ఎఫెక్ట్

ఇప్పుడు పడనుందా?

నిత్యావసరాల ధరలు కూడా..

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి వినియోగదారులకు భారంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం స్థిరంగా ఉన్న ఇంధన ధరలు, ఐదు రాష్ట్రాల్లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల అనంతరం పెరిగే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ పరిస్థితులు ఈ పెరుగుదలకు ప్రధాన కారణమవుతాయని నిపుణులు చెబుతున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, యుద్ధ వాతావరణం మరింత తీవ్రతరమైతే ప్రపంచ వ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా హర్మూజ్ కెనాల్ మూసివేత

- మిగతా 2వ పేజీలో

## బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్

వచ్చే ఎన్నికల్లో అధికారమే లక్ష్యం

పార్టీలో చేరికలకు యత్నం

బీఆర్ఎస్ నేతలకు గాలం?

ఆర్మూర్ జీవన్‌రెడ్డి, మల్కాజ్‌గిరి మల్లారెడ్డిలతో మంతనాలు

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

రానున్న అసెంబ్లీ ఎన్నికలను టార్గెట్ చేస్తూ ఇప్పుడే రాజకీయాలు వేడెక్కాయి. ఇంతకాలం కామ్‌గా ఉన్నా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయాల్లో యాక్టివ్ అవుతున్నట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఇక అధికార కాంగ్రెస్ పార్టీ సైతం సంక్షేమ పథకాల అమలుతో వచ్చే ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది. అయితే, తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ కూడా ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపింది. చాపకింద నీరులా తన పని తాను చేసుకుంటూ వెళ్తోంది.

### బీఆర్ఎస్ నేతలే టార్గెట్

బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేర్చుకునేందుకు కమల నాథులు ప్లాన్ చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మల్లారెడ్డితో బీజేపీ మంతనాలు చేస్తున్నట్లు సమాచారం. వీరు ఇప్పటికే ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దలను కలుస్తున్నారు. మరికొంత మంది రహస్యంగా కలుస్తున్నారు. బీఆర్ఎస్‌లో



అంత చురుగ్గా లేకుండా ఉన్న నేతలు గుంభనంగా తమ ప్రయత్నాలు తాము చేస్తున్నట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో అధికారం చేపట్టాలని బీజేపీ టార్గెట్ గా పెట్టుకుంది. గతంలో మాదిరిగా భారీ బహిరంగ సభలు, ఆర్భాటాలు లేకుండా.. నిశ్శబ్దంగా నియోజకవర్గ స్థాయి కీలక నేతలను ఆకర్షించే పనిలో పడినట్లుగా కనిపిస్తోంది. ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే

- మిగతా 2వ పేజీలో

## రేవంత్.. వన్ మ్యాన్ ఆర్మీ



### కాంగ్రెస్‌లో అన్నీ తానై.. మొదటి నుంచీ అదే తీరు

హైడ్రా, ఫ్యూచర్ సిటీ వంటి కీలక నిర్ణయాలు

కేసీఆర్ విషయంలో అందరినీ కలుపుకొని వెళ్తేనే మేలు

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతోంది. ప్రజా ప్రభుత్వంగా ప్రజల్లో మంచి పేరు ఉన్నా.. అధికార పార్టీ కాంగ్రెస్‌లో వన్ మ్యాన్ -ఆర్మీ-గా ముఖ్యమంత్రి రేవంత్ కనిపిస్తున్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారిన సమయంలో పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఆయన దూకుడుగా వ్యవహరించారు. ఆ దూకుడే గత ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఓ కారణమని చెప్పకతప్పదు. అప్పటికే పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌ను ఇంటిదారి పట్టించి, రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగురవేశారు. ఇదే.. ఆయనకు ఎంతో మంది సీనియర్లను కూడా పక్కన పెట్టి.. ముఖ్యమంత్రి పీఠం దక్కేలా చేసిందన్న వాదన ఉంది. ఎన్నికల వరకు రేవంత్ దూకుడును అందరూ సమర్థించారు. బలమైన బీఆర్ ఎస్ పార్టీని నిలువరించేందుకు అందరూ.. అప్పట్లో సర్దుకు పోయారు.

### కీలక నిర్ణయాలు..

పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సీఎంగా రేవంత్ రెడ్డి వన్ మ్యాన్ ఆర్మీగా వ్యవహరించడం.. తెలిసిందే. హైడ్రా వంటి కీలక వ్యవస్థను ఆయన తీసుకు వచ్చారు. అదేసమయంలో ఆయన రైజింగ్ తెలంగాణ, ఫ్యూచర్ సిటీ వంటివాటిని కూడా తెరపైకి తెచ్చారు. 3 ట్రిలియన్‌ల

- మిగతా 2వ పేజీలో





## సమ్మెలో విషాదం

### వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న శంకర్‌గౌడ్

పరిస్థితి విషమం.. కార్మికుల్లో తీవ్ర ఆందోళన

రాష్ట్రవ్యాప్తంగా రెండో రోజు కొనసాగిన సమ్మె

పోలీస్ భద్రత మధ్య 45శాతం బస్సులు రోడ్లపైకి..

తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్ల నియామకాలు

- 2లో



# బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్

(మొదటి పేజీ తరువాయి)

మల్లారెడ్డి వంటి నేతలు ఢిల్లీ పర్యటనలు చేయడం, అక్కడి అధిష్ఠాన పెద్దలతో రహస్యంగా భేటీ కావడం ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తోంది. వచ్చే ఆరు నెలల్లో బీఆర్ఎస్ నుంచి గణనీయమైన స్థాయిలో క్యాడర్ బీజేపీలోకి జంప్ అయ్యేలా ఆ పార్టీ ఒక రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకున్నట్లు కనిపిస్తోంది. బీజేపీకి గత ఎన్నికల్లో మంచి హైప్ వచ్చినా వారికి నియోజకవర్గ స్థాయిలో నాయకత్వం లేకపోవడం వల్లే విజయాలు రాలేదు. బీజేపీకి రాష్ట్రవ్యాప్తంగా ఓటు బ్యాంకు పెరుగుతున్నప్పటికీ, చాలా నియోజకవర్గాల్లో గెలిచే గుర్రాలు లేకపోవడం ఆ పార్టీకి పెద్ద మైనస్. ఈ లోటును పూడ్చుకోవడానికి బీఆర్ఎస్‌లో అసంతృప్తిగా ఉన్న , భవిష్యత్తు కోసం వెతుకుతున్న బలమైన నేతలపై కమలనాథులు కన్నేశారు. బీఆర్ఎస్ క్యాడర్‌ను తనలో విలీనం చేసుకోవడం ద్వారా, కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలన్నది బీజేపీ మాస్టర్ ప్లాన్. బీఆర్ఎస్, బీజేపీ మధ్య పొత్తులు ఉండవచ్చని ఎక్కువ మంది నమ్ముతున్నారు. అదే జరిగితే సగం సీట్లు బీఆర్ఎస్ కోల్పోవాల్సి ఉంటుంది. అందుకే రాజకీయ మనుగడ కోసం అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లలేని వారు, సహజంగానే బీజేపీని సురక్షితమైన వేదికగా భావిస్తున్నారు. మల్లారెడ్డి వంటి ఆర్థికంగా, రాజకీయంగా బలమైన నేతలు తమ సామ్రాజ్యాలను కాపాడుకోవడానికి, వారసులకు రాజకీయ భవిష్యత్తు కల్పించడానికి బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ వలసల వెనుక ఢిల్లీలోని బీజేపీ పెద్దల హస్తం స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్ర బీజేపీ నాయకత్వం కేవలం సమన్వయకర్తలుగా వ్యవహరిస్తుండగా, చేరికల విషయంలో తుది నిర్ణయం మాత్రం ఢిల్లీలోనే జరుగుతోంది. వచ్చే ఆరు నెలల కాలం తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకం కానుంది.

# రేవంత్.. వన్ మ్యాన్ ఆర్మీ

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక శక్తిగా తెలంగాణను డెవలప్ చేస్తామని కూడా చెబుతున్నారు. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. అభివృద్ధి అనేది.. అందరూ స్వాగతిస్తారు. కానీ, క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంకు రాలాలంటే.. మాత్రం.. కలివిడి ముఖ్యం. నాయకులు ఎవరైనా.. కార్యకర్తలు ఎక్కడైనా కలివిడిగా ఉంటేనే.. పార్టీ పరంగా ముందుకు సాగేందుకు అవకాశం ఉంటుంది. ఈ విషయంలో రేవంత్ చర్యలు ఆశించినట్టుగా లేవన్నది పార్టీ వర్గాల్లో జరుగుతున్న చర్చ. ఒకప్పుడు రేవంత్ రెడ్డిని సమర్థించిన నాయకులు కూడా.. ఇప్పుడు తెరమరుగవుతున్నారు. తమ అభిప్రాయాలను చెబుతున్నారు. తాజాగా జీవన్ రెడ్డి పార్టీని వదిలి వెళ్లిపోయిన తర్వాత.. ఆన్ లైన్ ఛానెళ్లు కొందరు.. సీనియర్లను కలిసినప్పుడు.. రేవంత్ రెడ్డి వ్యవహారంపై వారు సూటిగా స్పందించారు. "పార్టీ అంటే.. రేవంత్ ఒక్కరే అనుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు.. మండలస్థాయి నాయకులు కలివిడిగా ఉంటేనే.. నాడు అధికారంలోకి వచ్చాం. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడుందో చెప్పండి." అని సీనియర్ మోస్ట్ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. ఇది ఈయన ఒక్కరి మాటే కాదు.. దాదాపు సీనియర్లుగా ఉన్న అందరి మాట కూడా ఇదే. ఒకవైపు.. బీఆర్ ఎస్ పుంజుకునేందుకు ప్రయత్నం చేస్తోందని.. కానీ.. కాంగ్రెస్‌లో ఒకే ఒక్క నాయకుడు అన్నట్టుగా రేవంత్ వ్యవహరిస్తున్నారని పెదవి విరుస్తున్నారు. అందరినీ కలుపుకొని పోవడంలోనూ.. అభిప్రాయ సేకరణలోనూ ఎలాంటి ప్రాధాన్యం లేకుండా పోయిందని ఆక్షేపిస్తున్నారు. "ఆయనకు నచ్చిన వారిని పదవులు ఇచ్చారు. ఇస్తున్నారు" అంటూ... కొందరు వేం నరేందర్‌రెడ్డి వ్యవహారాన్ని తెరమీదికి తెస్తున్నారు. ఇలా.. చేయడం వల్ల.. వన్ మ్యాన్ ఆర్మీగా రేవంత్‌ను మెచ్చుకునేవారికి సంతోషమే అయినా.. క్షేత్రస్థాయిలో పార్టీ బలహీన పడిందని ఒకరిద్దరు చెప్పడం విశేషం. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విమర్శలు చేయడంలోనూ రేవంత్‌రెడ్డి ఒక్కరే ముందుంటున్నారు. అధికారం వచ్చిన తొలి నాళ్లలో ప్రదర్శించిన దూకుడును ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. మరో రెండేళ్లలో ఎన్నికలు రాబోతున్న తరుణంలో.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయాల్లో యాక్టివ్ అవుతున్న తరుణంలో అందరూ కలిసి పని చేస్తేనే వచ్చే ఎన్నికల్లో అనుకూల ఫలితాలు వస్తాయని అంటున్నారు.

# ఎన్నికల తర్వాత ఇంధన షాక్?

(మొదటి పేజీ తరువాయి)

వంటి పరిణామాలు చోటుచేసుకుంటే, గ్లోబల్ ఆయిల్ సరఫరాలో భారీ అంతరాయం ఏర్పడుతుంది. ఇది నేరుగా క్రూడ్ ఆయిల్ ధరలపై ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ స్టాక్ బ్రోకరేజ్ సంస్థ కోటాక్ ఈక్విటీస్ నివేదిక ప్రకారం, ఇండియాలో పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.25 నుండి రూ.28 వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధరలు పెరుగుతున్న ధోరణి కూడా ఈ అంచనాలకు బలం చేకూరుస్తోంది. ఇక దేశీయంగా రూపాయి విలువ తగ్గడం, రవాణా ఖర్చులు పెరగడం, ప్రభుత్వపు పన్ను విధానాలు వంటి అంశాలు కూడా ఇంధన ధరల పెరుగుదలకు దోహదపడతాయి. ఎన్నికల సమయంలో సాధారణంగా ధరలను నియంత్రించే ప్రయత్నాలు ఉంటాయి. అయితే ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ నియంత్రణలు సడలించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రాబోయే రోజుల్లో ఇంధన ధరలు పెరిగితే, దాని ప్రభావం సాధారణ ప్రజల జీవన వ్యయంపై పడే అవకాశం ఉంది. రవాణా, నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మే 4న మిఠాయిలు, ఝాల్‌మురీ తినిపిస్తాం

### బెంగాల్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

### ఎన్నికల్లో తగ్గిన హింస.. ఈసీకి అభినందనలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి మే 4వ తేదీయే 'ఎక్స్‌పైరీ డేట్' అని ప్రధాని నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. రాష్ట్రంలో 15 ఏళ్ల సిండికేట్ వ్యవస్థ, మహా జంగిల్‌రాజ్ అంతమైపోతుందని స్పష్టంచేశారు. ప్రధాని మోదీ గురువారం బెంగాల్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. రెండో విడత అసెంబ్లీ ఎన్నికలు జరిగే మథురాపూర్, కృష్ణానగర్ నియోజకవర్గాల్లో బహిరంగ సభల్లో ప్రసంగించారు. తొలి విడత ఎన్నికల్లో భారీగా ఓటింగ్ నమోదు కావడం తృణమూల్ కాంగ్రెస్‌పై ప్రజా వ్యతిరేకతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఓటర్లకు అభినందనలు తెలియజేశారు. ఈ ఓటింగ్‌ను 'మార్పు కోసం ఇచ్చిన తీర్పు'గా అభివరి?ణంచారు. బెంగాల్ ఓటర్ల నిర్ణయం మేరకు మార్పునకు అనుకూలంగా అఖండమైన తీర్పు రాబోతోందని అన్నారు. అధికార పార్టీ సృష్టించిన భయాన్ని బీజేపీ ఇస్తున్న భరోసా చిత్తుచిత్తుగా ఓడించబోతోందని స్పష్టంచేశారు. బీజేపీ ప్రభంజనం సృష్టించడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. దేశంలో భారీ ఓటింగ్ నమోదైన ప్రతిచోటా బీజేపీ విజయాలు సాధిస్తోందని వెల్లడించారు. వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక విజయోత్సవాలు నిర్వహిస్తామని, బెంగాల్ ప్రజలకు మిఠాయిలతోపాటు ఝాల్‌మురీ పంపిణీ చేస్తామని మోదీ ప్రకటించారు. బెంగాల్‌లో తాను ఝాల్‌మురీ రుచిని ఆస్వాదించడం కొందరికి పిడుగుపాటు లాంటి షాక్ ఇచ్చిందన్నారు. తాను ఝాల్‌మురీ రుచి చూస్తే తృణమూల్ కాంగ్రెస్ నాయకులకు మిరపకాయల ఘాటు తగులుతోందని ఎద్దేవా చేశారు. తొలి దశ ఎన్నికల సందర్భంగా హింసాకాండను కనిష్ట స్థాయిలో ఉంచినందుకు ఎన్నికల సంఘాన్ని అభినందించారు. 50 ఏళ్ల బెంగాల్ ఎన్నికల చరిత్రలో హింసాత్మక ఘటనలు కనిష్ట స్థాయికి తగ్గడం ఇదే మొదటిసారి అని వెల్లడించారు. ఆయన ఇంకా ఏం మాట్లాడారంటే.. "బెంగాల్‌లో లంచాలు లేకుండా పనులు జరిగే రంగం ఒక్కటి కూడా లేదు. టీఎంసీ సిండికేట్లు, వారి మధ్యవర్తులు కట్ మనీ తీసుకోని రంగమే లేదు. 15 ఏళ్ల సిండికేట్ వ్యవస్థ, మహా జంగిల్‌రాజ్‌కు కాలం చెల్లిపోయింది. ఆ గడువు మే 4వ తేదీ. తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేసినందుకు మమతా బెనర్జీ ప్రభుత్వం బాధ్యత వహించాలి. వరదలతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాల్లో వంతెనలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. చివరకు ప్రజలను దగా చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు బెంగాల్‌లో అమలు కాకుండా అడ్డుకున్నారు. అభివృద్ధి పనుల కోసం కేంద్రమిచ్చిన నిధులను స్వాహా చేశారు.






# ఆర్టీసీ సమ్మెలో విషాదం

## వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

- సమ్మెపై మంత్రివర్గ సమావేశంలో చర్చ
- నేతలను చర్చలకు పిలిచిన ప్రభుత్వం
- నేడు భట్టి నేతృత్వంలో సమావేశం
- రోజుకో తరహాలో నిరసనలు: ఆర్టీసీ
- తొందరపాటు వద్దు.. ప్రాణం తిరిగిరాదు!
- కార్మికుడి ఆత్మహత్యాయత్నంపై రేవంత్
- సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో ఉన్నామని వ్యాఖ్య

ఆర్టీసీ కార్మికుల సమ్మెలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ కోలా శంకర్‌గౌడ్ ఆత్మహత్యాయత్నం చేశారు. బస్‌స్టేషన్‌లోనే ఒంటిపై పెట్రోలు పోసుకుని, నిప్పంటించుకున్నారు. ప్రయాణికులు, కార్మికులు వెంటనే మంటలు ఆర్పి ఆస్పత్రికి తరలించారు. శంకర్‌గౌడ్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. నల్లగొండ, ఖమ్మంలలో మరో ఇద్దరు ఆర్టీసీ డ్రైవర్లు కూడా ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ వరుస పరిణామాలతో ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. మరోవైపు సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగింది. తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లను నియమించడం, పోలీసులతో భద్రత ఏర్పాటు చేయడంతో గురువారం 45శాతం వరకు బస్సులు నడిచాయి. కాగా, రెండో రోజు సమ్మెలో ఊహించని పరిణామాలు చోటు చేసుకోవడంతో సమ్మె తదుపరి కార్యరూపం ఎలా ఉంటుందోననే అంశంపై నిఘా వర్గాలు రంగంలోకి దిగినట్టు సమాచారం. బస్సులు సరిపడా లేకపోవడంతో ప్రైవేటు వాహనాల దోపిడీ కొనసాగింది. రెండింతలకుపైగానే చార్జీలు వసూలు చేస్తుండటంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన ఆందోళన..

రాష్ట్రవ్యాప్తంగా గురువారం కూడా ఆర్టీసీ జేఏసీ సమ్మె కొనసాగింది. కార్మికులు విధులు బహిష్కరించి డిపోల ముందు, బస్‌స్టేషన్లలో నిరసన ప్రదర్శనలు, నిరాహార దీక్షలు నిర్వహించారు. బస్సులు బయటికి రాకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, కార్మికులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. పలుచోట్ల సమ్మెలో పాల్గొంటున్న ఆర్టీసీ కార్మికులకు టెంట్లు, సామగ్రి సరఫరా చేయవద్దంటూ స్థానిక పోలీస్ స్టేషన్ల నుంచి టెంట్‌హౌస్‌ల నిర్వాహకులకు ఆదేశాలు వెళ్లాయి. పలుచోట్ల వేసిన టెంట్లను కూడా తొలగించారు. దీనితో ఆర్టీసీ కార్మికులు ఎండలోనే ఆందోళనలు కొనసాగించారు. తమ సమ్మెకు అడ్డుపడొద్దని కోరుతూ కొన్నిచోట్ల కార్మికులు పోలీసు అధికారుల కాళ్లు పట్టుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో ఒక తాత్కాలిక డ్రైవర్ బస్సును డిపో నుంచి బయటికి తీస్తుండగా.. ఇద్దరు మహిళా కండక్టర్లు మంజుల, సునీత బస్సుపై కారం చల్లారు. దీనిపై డిపో మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### తొందరపాటు చర్యలు వద్దు: మంత్రులు

సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో గురువారం జరిగిన కేబినెట్ భేటీలో ఆర్టీసీ సమ్మెపై చర్చ జరిగింది. కార్మికులు లేవనెత్తిన 32 డిమాండ్లు, వాటికి పరిష్కారాలు, సమ్మె పరిస్థితిపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. "ఆర్టీసీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలు పరిష్కరించాం. పీఆర్సీ, ఉద్యోగుల విలీనం, సంఘాలకు గుర్తింపుపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కార్మికులెవరూ తొందరపాటు చర్యలకు పాల్పడవద్దు. అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దు" అని విజ్ఞప్తి చేశారు. ఇక ఆర్టీసీ కార్మికులు ఆత్మబలిదానాలకు పాల్పడవద్దని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ ఆదుకోవడంతోపాటు కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్మికులు సంయమనం పాటించాలని, రెచ్చగొట్టే శక్తుల ఒత్తిడికి బలికావొద్దని మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు. అనాలోచిత చర్యలకు పాల్పడి కుటుంబాలకు అన్యాయం చేయవద్దన్నారు. సమ్మె విరమించాలని కోరారు. ఇక ఆర్టీసీ కార్మికులు తమ కుటుంబ సభ్యుల లాంటి వారని.. భావోద్వేగాలతో సమస్యలు పరిష్కారం కావని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. కాగా, ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తుందని.. ఆత్మహత్య వంటి ఆలోచనలు చేయవద్దని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విజ్ఞప్తి చేశారు. సమ్మెకు దిగిన ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులను ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో పొన్నం ప్రభాకర్, ఇతర మంత్రులు శుక్రవారం కార్మిక సంఘం నాయకులతో చర్చలు జరపనున్నారు. చర్చల అనంతరం తక్షణమే పరిష్కారమయ్యే అంశాలపై ప్రభుత్వం నుంచి ప్రకటన వెలువడే అవకాశముంది.

### నేటి నుంచి రోజుకో తరహాలో నిరసనలు: జేఏసీ

తమ 32 డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని ఆర్టీసీ జేఏసీ వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి చెప్పారు. మూడు ప్రధాన డిమాండ్లను పక్కనబెట్టి 29 అంశాలను పరిష్కరిస్తామని మంత్రి చెప్పిన మాటలతో కార్మికులు కలత చెంది అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సమ్మెలో రోజుకో విధంగా నిరసన కార్యక్రమాలతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు. శుక్రవారం బస్‌డిపోల ఎదుట మౌన ప్రదర్శనలు నిర్వహిస్తామని చెప్పారు. తర్వాత వరుసగా వంటా వార్పు, కార్మిక కవాత్, 27న ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాల సమర్పణ, 28న మహిళా కార్మికుల బతుకమ్మ, 29న డిపోల ముందు అర్ధనగ్న ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించామని థామ్‌సరెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలనే డిమాండ్ చేస్తున్నామని టీఎంయూ మాజీ అధ్యక్షుడు అశ్వత్థామరెడ్డి స్పష్టం చేశారు.

### బస్టాండ్ మధ్యలో నిలబడి.. పెట్రోల్ పోసుకుని..

తమ సమస్యలను పరిష్కరించాలంటూ వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ కోలా శంకర్‌గౌడ్ (55) ఆత్మహత్యాయత్నం చేశారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో తోటి కార్మికులతో కలిసి టీ తాగేందుకు సమ్మె శిబిరం నుంచి శంకర్‌గౌడ్ బయటికి వెళ్లారు. కాసేపటి తర్వాత ఒక బాటిల్‌లో పెట్రోల్ తీసుకుని బస్టాండ్‌లోకి వచ్చారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేస్తూ.. పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని, నిప్పంటించుకున్నారు. ఈ క్రమంలో అధికారులు పరుష పదజాలంతో మాట్లాడటంతో ఆవేదన చెందారని తోటి కార్మికులు తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారని వెల్లడించారు. శంకర్‌కు దివ్యాంగురాలైన భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### మరో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

నర్సంపేటలో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం వార్తలు వచ్చిన కాసేపటికి నల్లగొండ బస్టాండ్ ప్రాంగణంలో మిర్యాలగూడ డిపో డ్రైవర్ వెంకన్న ఆత్మహత్యాయత్నం చేశారు. కాగా, వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న సమయంలో డ్రైవర్ శంకర్‌గౌడ్‌ను మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శించారు. శంకర్‌గౌడ్‌కు ఏదైనా జరిగితే సీఎం, మంత్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎర్రబెల్లి అన్నారు.'

### ఆదుకుంటాం: పొన్నం

మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం రాత్రి కంచన్‌బాగ్ అపోలో ఆస్పత్రికి వెళ్లి డ్రైవర్ శంకర్‌గౌడ్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తర్వాత పొన్నం మీడియాతో మాట్లాడారు. డ్రైవర్ శంకర్‌కు మెరుగైన వైద్యం అందిస్తున్నామని చెప్పారు. "సమస్యలు పరిష్కరించడంపై ప్రభుత్వం సానుకూలంగా ఉంది. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు ఎవరూ అధైర్యపడవద్దు. అఘాయిత్యాలకు పాల్పడవద్దు. ఆర్టీసీ కార్మికులు మా కుటుంబ సభ్యులే. గతంలో సమ్మెలు జరిగినప్పుడు పదుల సంఖ్యలో కార్మికులు చనిపోతే ఏ ఒక్క మంత్రి కూడా వచ్చి పరామర్శించలేదు. కానీ కార్మికుల పట్ల మా ప్రభుత్వానికి బాధ్యత ఉంది. మా సోదరులకు అండగా ఉంటాం" అని చెప్పారు. కాగా, శంకర్‌గౌడ్ మృతిచెందారని.. ఇది తెలిస్తే ఆర్టీసీ కార్మికులు భారీగా ఆందోళనకు దిగవచ్చనే ఉద్దేశంతో ప్రకటించలేదని ప్రచారం జరిగింది. అది అవాస్తవమని, ఆర్టీసీ కార్మికుల్లో ఆందోళన రేపేలా ఇలాంటి ప్రచారం చేయవద్దని మంత్రి పొన్నం పేర్కొన్నారు.

# జనంలోకి కేసీఆర్!

(మొదటి పేజీ తరువాయి)

పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఆమె బీఆర్ఎస్ పార్టీనే టార్గెట్ చేస్తున్నారు. పార్టీ నుంచి బయటకు వచ్చిన నాటి నుంచి పార్టీ అగ్రనేతలు హరీశ్‌రావు, ఆ తర్వాత కేటీఆర్‌లపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. ఇది పార్టీ శ్రేణులను కొంత కలవరపరుస్తున్న విషయమే. ఎందుకంటే, కవిత స్వయంగా పార్టీ అధినేత కుమార్తె. ఉద్యమ సమయం నుంచి తెలంగాణ జాగృతి ఏర్పాటు చేసి ఉద్యమానికి చేదోడు వాదోడుగా ఉన్నారు. ఓ సారి ఎంపీగా, మరో సారి ఎమ్మెల్సీగా రాజకీయాల్లో కీలకంగా వ్యహరించారు. అలాంటి నాయకురాలు బయటకు వచ్చి విమర్శలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

### వరంగల్‌లో రైతు ఆశీర్వాద సభ

ఇటీవలే జగిత్యాలలో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన కేసీఆర్.. ఇప్పుడు వరంగల్ వేదికగా మరో రాజకీయ సంచలనానికి సిద్ధమవుతున్నారు. మే మొదటి వారంలో వరంగల్ 'రైతు ఆశీర్వాద సభ' ప్రస్తుతం రైతుల సమస్యలే ప్రధాన అస్త్రంగా కేసీఆర్ ముందుకు సాగుతున్నట్లు స్పష్టమవుతోంది. తాజా సమాచారం ప్రకారం.. మే మొదటి వారంలో వరంగల్‌లో బీఆర్ఎస్ భారీ ఎత్తున 'రైతు ఆశీర్వాద సభ'ను నిర్వహించనుంది. ఈ సభలో స్వయంగా కేసీఆర్ పాల్గొని, రైతులకు భరోసా ఇవ్వడంతో పాటు ప్రభుత్వ విధానాలపై మరోసారి గర్జించనున్నారు. రైతుల్లో ఉన్న అసంతృప్తిని రాజేసి.. మళ్లీ పార్టీని అధికారంలోకి తేవాలనుకుంటున్నారు. జగిత్యాల సభకు వచ్చిన విశేష స్పందనతో, వరంగల్ లోనూ అదే జోరును కొనసాగించాలని బీఆర్ఎస్ అధిష్టానం భావిస్తోంది. ఇకపై ఎన్నికలు వచ్చినా రాకపోయినా, నిరంతరం ప్రజల మధ్యనే ఉండాలని కేసీఆర్ డిసైడ్ కావడం పార్టీ క్యాడర్‌కు కొండంత అండ అనుకోవచ్చు.

### 27న కీలక సమావేశం

వరంగల్ సభ కంటే ముందే ఈ నెల 27న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ కీలక సమావేశం నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఈ కీలక సమావేశం నిర్వహించనున్నట్టుగా ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ సంస్థాగత బలోపేతంపై దృష్టి సారించనున్నట్టుగా తెలుస్తోంది. అలాగే ఈ సమావేశంలో రాజకీయ పరంగా పలు కీలక నిర్ణయాలు తీసుకోనునే అవకాశం ఉంది. ముఖ్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణం సభ్యత్వాల పునరుద్ధరణ వంటి అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించనున్నట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయాలు, మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీ క్యాడర్‌ను ఎలా ముందుకు తీసుకెళ్లాలి, సభ్యత్వ నమోదు ప్రక్రియను ఏ విధంగా వేగవంతం చేయాలి అనే విషయాలపై బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. అలాగే, బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కూడా ఈ భేటీ తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

# మేలో నామినేటెడ్, పార్టీ పదవుల భర్తీ పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

పనితీరుతోపాటు కులగణన తదితర కీలక అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు అంశాలను వెల్లడించారు.

### పార్టీ కేడర్‌కు గుర్తింపు..

పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని మహేశ్‌గౌడ్ తెలిపారు. అందులో భాగంగానే టీపీసీసీ పూర్తిస్థాయి కార్యవర్గ నియామకంతోపాటు వివిధ కార్పొరేషన్లు, బోర్డులకు సంబంధించిన నామినేటెడ్ పదవుల భర్తీపై రాహుల్ గాంధీతో విస్తృతంగా చర్చించినట్లు చెప్పారు. ఈ నియామకాల ప్రక్రియను మేలో పూర్తి చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని.. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య మెరుగైన సమన్వయం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మహేశ్‌గౌడ్ చెప్పారు.

### ఏఐసీసీ ఓబీసీ భేటీ హైదరాబాద్‌లో జరపాలి..

బీసీల సాధికారతపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధిని దేశవ్యాప్తంగా చాటేలా రాబోయే ఏఐసీసీ జాతీయ ఓబీసీ సలహా మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని రాహుల్ గాంధీని కోరినట్లు మహేశ్‌గౌడ్ తెలిపారు. దేశవ్యాప్తంగా బీసీల హక్కుల కోసం కాంగ్రెస్ చేస్తున్న పోరాటానికి తెలంగాణ వేదికగా మరింత మద్దతు కూడగట్టేందుకు ఈ సమావేశం ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే మహిళా రిజర్వేషన్ల బిల్లులో బీసీ రిజర్వేన్ల అంశాన్ని కూడా జోడించాలని రాహుల్‌కు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ ఎదుగుదలకు కాంగ్రెస్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, ఏ దశలోనూ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

### కేసీఆర్‌లా ఒక్కరోజు సర్వే కాదు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేపై ప్రతిపక్షాల విమర్శలను మహేశ్‌గౌడ్ ఖండించారు. సర్వే ప్రక్రియలో ఎక్కడా లోపం జరగలేదని.. అత్యంత శాస్త్రీయంగా వివరాల నమోదు జరిగిందని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ హడావుడిగా ఒక్క రోజులోనే సర్వే చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అలా చేయలేదని.. ఎన్యూమరేటర్లు నేరుగా ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి క్షుణ్ణంగా వివరాలు సేకరించారని వివరించారు. ఈ వాస్తవ డేటా ఆధారంగానే భవిష్యత్తులో బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అవసరమైన విధానాలను రూపొందిస్తామని ఆయన చెప్పారు. సమాజంలో ప్రతి వర్గానికి సామాజిక న్యాయం దక్కాలన్న రాహుల్ గాంధీ ఆశయాన్ని తెలంగాణలో 100 శాతం అమలు చేసి తీరుతామని మహేశ్‌గౌడ్ ఉద్ఘాటించారు.



## ప్రజా పాలన ప్రగతి నివేదన

### 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యార్థులతో కలిసి మంత్రి అల్పాహార విందు...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఏప్రిల్ 23.**

ప్రజా పాలన ప్రగతి నివేదనలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో గురువారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , జగిత్యాల శాసన సభ్యులు డా. సంజయ్ కుమార్ , మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ , జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. విద్యార్థులతో మమేకమై వారి అభ్యాస పరిస్థితులు, వసతి సదుపాయాలు, ఆహార నాణ్యతపై ఆరా తీశారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని, గురుకుల విద్యాసంస్థలను మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అందుతున్న సదుపాయాలపై తమ అభిప్రాయాలను వెల్లడించగా, అధికారులను త్వరితగతిన పరిష్కరించుటకు ఆదేశించారు ఇట్టి కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ సంగనబట్ల దినేష్, ఆర్‌డీవో మధుసూదన్, డీసీసీ అధ్యక్షులు నందయ్య, కౌన్సిలర్లు దుమాల రాజ్ కుమార్, బడుగు పద్మ రాజేందర్, బొల్లరపు స్వప్న గిరిధర్, ఖాజా కమలుద్దిన్, మాజీ చైర్మెన్ గిరి నాగభూషణం, నాయకులు బండ శంకర్ పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీగా చేతన్ నితిన్

### బాధ్యతలు స్వీకరించి ఎస్పీని కలిసిన అదనపు ఎస్పీ

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఏప్రిల్ 23.**



జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీగా చేతన్ నితిన్ ను ప్రభుత్వం నియామకం చేసింది. బదిలీపై వచ్చిన చేతన్ నితిన్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను ను అందజేశారు. చేతన్ నితిన్ ఐపిఎస్ 2022 బ్యాచ్‌కు చెందిన అధికారి. గతంలో జనగామ ఏఎస్పి గా విధులు నిర్వర్తించగా ప్రస్తుతం జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీగా బదిలీ అయ్యారు.

## రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.1,00,016 విరాళం



**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) ఏప్రిల్ 23:**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధికి మరియు విస్తరణకై శ్రీమతి నీలారపు పద్మజ -- శ్రీ శివకుమార్ దంపతులు, చింతల్, హెచ్ఎంటీ, హైదరాబాద్ నివాసులు రూ. 1,00,016/-లను(ఒక లక్ష 16 రూపాయలు) విరాళంగా అందజేశారు. ఏఈఓ జి. శ్రావణ్ కుమార్ కు అందజేశారు.



## చేర్యాలలో శ్రీ అధ్య రాజ్ హాస్పిటల్ ప్రారంభించిన ఎంపీ ఈటల రాజేందర్

**(వినోద్, ప్రజా తీర్పు మేడ్చల్ జిల్లా) ఏప్రిల్ 23 :**

మేడ్చల్ జిల్లా, కిసర, చేర్యాల డివిజన్ పరిధిలోని చేర్యాల పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీ అధ్య రాజ్ హాస్పిటల్‌ను గురువారం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ప్రారంభించారు. ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండటం సమాజ అభివృద్ధికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న వైద్య సేవల లోటును ఈ ఆసుపత్రి కొంత మేర తీర్చగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆధునిక వైద్య సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందంతో ఈ హాస్పిటల్ ప్రజలకు నమ్మకమైన సేవలను అందిస్తుందని తెలిపారు. అత్యవసర వైద్యం, మహిళలు, చిన్నారులు, వృద్ధులకు మెరుగైన సేవలు అందేలా ఆస్పత్రి నిర్వహణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాంత ప్రజలు ఇకపై మెరుగైన వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని, స్థానికంగానే ఆరోగ్య సేవలు పొందగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి యాజమాన్యం,చేర్యాల, కిసర, నాగారం ప్రజా ప్రతినిధులు హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో బహుజన రాజ్యం వస్తుంది

### ఏఐఎఫ్‌బీ జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్

**పెద్దపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 23, (ప్రజా తీర్పు):**



పెద్దపల్లిలో బహుజన రాజ్యం స్థాపన దిశగా ముందుకు సాగుతున్నామని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ మెహరాజ్‌ను పార్టీ కండువా కప్పి ఏఐఎఫ్‌బీలోకి ఆహ్వానించారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పెద్దపల్లి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా ఏకమై బహుజన రాజ్యాధికార సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బహుజనుల మద్దతుతో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ప్రకటించారు. తాను బహుజన వర్గానికి చెందినవాడినని, ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త మహ్మద్ మెహరాజ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమల్లో విఫలమైందని ఆరోపించారు. బహుజన రాజ్య స్థాపన లక్ష్యంతోనే ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కొలిపాక శ్రీనివాస్ నాయకత్వంలో బహుజనులందరిని ఏకం చేసి బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని ఎమ్మెల్యేగా చేసే వరకు పోరాటం కొనసాగిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుక్క శ్రావణ్ కుమార్, గులాం ఖాజా పాషా, కుక్క కనకరాజు, బొంకూరి నరేందర్, కుక్క అశోక్, ఇరుగురాల రాజు, కుక్క శ్రీనాథ్, వడ్డేపల్లి తిరుమల్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ రక్షణ కోసం సమస్యల సాధన కోసం రెండో రోజు సమ్మె

### కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకై సమ్మె

**భైంసా, ఏప్రిల్ 23 (ప్రజా తీర్పు)**

నిర్మల్ జిల్లా భైంసా పట్టణం డిపో ఆవరణలో టీజీ ఆర్టీసీ జేఏసీ అధ్యక్షులు గంగన్న, మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల ప్రధానమైన డిమాండ్లను ప్రకటించారు. డ్రైవర్లు, కండక్టర్లు, ఆర్టీసీ సంస్థానందు పనిచేస్తున్న కార్మికులు, ఆర్టీసీకి ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ప్రారంభించాలి. 2021 నూతన సవరణ 30% ఫిట్మెంట్ తో అమలు చేయాలి 2025 అమలు చేయాలి మహాలక్ష్మి పథకం కింద, ప్రభుత్వం ఇవ్వాల్సిన డబ్బులు ప్రతినెల 400 కోట్లు ఆర్టీసీకి ఇవ్వాలి. ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత ఇప్పించాలి. బెడ్రూ విన్నర్ పోస్టులను పర్మినెంట్ కింద చేయాలి ట్రేడ్ యూనియన్ల పై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు, నిర్వహించాలి ఆర్టీసీ ఉద్యోగులపై పనిభారాలు తగ్గించాలి. కండక్టర్ మరియు డ్రైవర్ల పై కేఎంపిఎల్, ఈపీకే వేధింపులు మానుకోవాలి ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వమే కొన్ని ఆర్టీసీకి ఇవ్వాలి. ఆర్టీసీ స్థలాలను ఇవి బస్సులకు ఇవ్వరాదు. అద్దె బస్సులను బస్సుల డ్రైవర్లను, విలినం చేసుకోవాలి గతంలో మాదిరిగా జాతీయం చేసుకోవాలి, బదిలీ చేసే ఉత్తర్వులను రద్దు చేయాలి. 2019 సమ్మె కాలంలో నమోదైన పోలీస్ కేసులను ఎత్తివేయాలి మహిళా కార్మికులు, ఎదుర్కొంటున్న సమస్యలను, పరిష్కరించాలి. రద్దీకి అనుకూలంగా బస్సుల సంఖ్యను పెంచాలి. అన్ని కేటగిరిలోని ఖాళీలను భర్తీ చేయాలి. రిటైర్ అయిన ఉద్యోగుల బకాయిలను అన్నింటిని చెల్లించాలి. చెల్లించడంతోపాటు దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను, పరిష్కరించాలి. ఈ కార్యక్రమంలో టిఎస్ఆర్టిసి జేఏసీ ప్రధాన కార్యదర్శి, రాజన్న, కోశాధికారి సుధాకర్ బాబు, మహిళ ప్రధాన కార్యదర్శి సరోజన తదితర జేఏసీ నాయకులు ఆర్టీసీ ఉద్యోగులు డ్రైవర్లు, కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## మండుటెండలో 13వ రోజుకు చేరిన దీక్షలు

### ఇళ్ల పట్టాల కోసం కాలనీవాసుల ఆందోళన

**గోదావరిఖని, ఏప్రిల్ 23,( ప్రజా తీర్పు):**




ఇళ్ల పట్టాల కోసం మంద కొమరమ్మ కాలనీవాసులు చేపట్టిన దీక్షలు మండుటెండలోనూ 13వ రోజుకు చేరాయి. ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు పట్టాలిచ్చే కార్యక్రమం చేపట్టిన నేపథ్యంలో తమకు కూడా ఇళ్ల పట్టాలు ఇవ్వాలని దీక్షలో కూర్చున్న వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దారిద్ర రేఖకు దిగువన ఉన్న మాదిగ వర్గానికి చెందిన అనేక మంది పేదలకు సొంత ఇళ్లు లేక కిరాయిలు చెల్లించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ స్పందించి తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు కనికరం చూపి సమస్యను పరిష్కరించాలని దీక్షకారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంద రవికుమార్, రొంటాల రాధా, అంబాల అర్చన, రాసపల్లి రవికుమార్, మైస రవీందర్, కాసిపేట రాజయ్య, మడిపల్లి దశరథం, కాంపల్లి శ్రీనివాస్, రామంచ సరోజన, శనిగరపు పౌల్, కనకం సుగుణ, రెంటాల సుజాత, పుల్లూరు కొమురయ్య తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## కుషాయిగూడ ఆర్టీసీ డిపో కార్మికుల ధర్నాకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంఘీభావం

**(వినోద్, ప్రజా తీర్పు మేడ్చల్ జిల్లా, ప్రతినిధి ) ఏప్రిల్ 23:-**

మేడ్చల్ జిల్లా కాప్రా డివిజన్ పరిధిలోని కుషాయిగూడ ఆర్టీసీ డిపో వద్ద గురువారం ఆర్టీసీ కార్మికులు ఆందోళనకు దిగారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో మభ్యపెడుతోందని ఆరోపిస్తూ కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన ఈ నిరసన కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంఘీభావం తెలిపారు. డిపో వద్దకు చేరుకున్న ఆయన కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికులు ప్రజలకు నిరంతరం సేవలందించే కీలక సిబ్బందని, వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వేతన సవరణలు, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాలు, ఖాళీ పోస్టుల భర్తీ వంటి అంశాలపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్మికులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందన్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఆర్టీసీ ఉద్యోగులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గురుకులంలో పేరెంట్స్ సమావేశం విద్యార్థుల అభివృద్ధిపై సూచనలు

### టిఇపిఏ వ్యవస్థాపకుడు దార మధు

**మంథని, ఏప్రిల్23(ప్రజా తీర్పు)**

మంథని పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల బాలురలో పేరెంట్-టీచర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎడ్యుకేషనల్ పేరెంట్స్ అసోసియేషన్ (టిఇపిఏ) వ్యవస్థాపకుడు అలాగే పేరెంట్స్ కమిటి చైర్మన్ దార మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల చదువు, క్రమశిక్షణ, భవిష్యత్ లక్ష్యాలపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే పేరెంట్స్ తమ పిల్లల చదువుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, పాఠశాలతో సమన్వయం పెంచుకోవాలని సూచించారు. విద్యార్థుల సమస్యలు, వసతి సౌకర్యాలు, ఆహార నాణ్యత వంటి అంశాలపై కూడా చర్చ జరిగినది. పాఠశాల అభివృద్ధి కోసం పేరెంట్స్, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాలని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ కార్యక్రమంలో డి సి ఓ అండ్ ప్రిన్సిపాల్ ఊటూరి శ్రీనాథ్, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ ఓ. నవీన్ పేరెంట్స్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సిపిఐ మద్దతు

### ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలి: తాండ్ర సదానందం

**గోదావరిఖని, ఏప్రిల్ 23,( ప్రజా తీర్పు):**



ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు సిపిఐ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పేర్కొన్నారు. గురువారం గోదావరిఖని ఆర్టీసీ డిపో వద్ద కొనసాగుతున్న కార్మికుల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కె. కనకరాజ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాండ్ర సదానందం మాట్లాడుతూ... ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నలభై రోజుల కిందటే రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చినా ఇప్పటివరకు స్పందించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. వేతన సవరణ, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సహా 32 డిమాండ్ల సాధన కోసం కార్మికులు సమ్మె చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేదంటే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు అబ్దుల్ కరీం, కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మాటేటి శంకర్, టి. రమేశ్ కుమార్, నవీన్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో కవితక్క పార్టీ పోస్టర్ ఆవిష్కరణ

**(రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజా తీర్పు) ఏప్రిల్ 23**



జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక్క ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షులు సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి వరద సతీష్ కుమార్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని మండలాల ఇన్చార్జీలు నాయకులతో కలిసి కవితక్క నూతనంగా పెట్టబోయే కొత్త పార్టీ పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షులు సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ వర్ధ సతీష్ కుమార్ మాట్లాడుతూ కల్వకుంట్ల కవితక్క 20 సంవత్సరాల క్రితం తెలంగాణ జాగృతి సంస్థను ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు చేయడమే కాకుండా జాగృతి సంస్థ ద్వారా తెలంగాణ మలిదశ ఉద్యమంలో సబ్బండ వర్గాలను కలుపుకొని అనేక ప్రజా ఉద్యమ పోరాటాలు చేసి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించేవరకు కెసిఆర్ తో కలిసి పని చేశారు తరువాత క్రమంలో ఎంపీగా ఎమ్మెల్సీగా ఈ రాష్ట్రానికి రాష్ట్ర ప్రజలకు సేవలు అందించారు సొంత పార్టీలో అవకతవకలు జరుగుతున్నాయని ఎన్నోసార్లు చెప్పినా పట్టించుకోకుండా కవితక్కకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పార్టీ నుంచి సస్పెండ్ చేశారు సస్పెండ్ చేయడమే కాకుండా కుటుంబ సభ్యులే ఢిల్లీ నాయకులతో కుమ్మక్కై చేయని తప్పుకు ఢిల్లీ లిక్కర్ కేసులో ఇరికించి ఐదు నెలల పాటు జైలు జీవితం గడిపేలా చేసి రాక్షస ఆనందం పొందారు కవితక్క ఆనాడే చెప్పింది కడిగిన ముత్యంల నేను బయటకు వస్తానని తను చెప్పినట్టుగానే ఢిల్లీ కోర్టు కవితక్క నిర్దోషి లిక్కర్ స్కామ్ తో ఎలాంటి సంబంధం లేదని కవితక్క నిర్దోషి అని క్లీన్ చీట్ ఇవ్వగానే కాంగ్రెస్ టిఆర్ఎస్ బిజెపి పార్టీలకు చెంపపెట్టు లాగా తీర్పు వచ్చింది కానీ కవితక్క ఎవరికి భయపడకుండా మొక్కవోని దీక్షతో ప్రజల మధ్యకు వెళ్లి ప్రజా సమస్యల పరిష్కారానికి జనం బాట అనే కార్యక్రమం తీసుకొని 20 జిల్లాల్లో పర్యటించిన సందర్భంలో జనం నుంచి పెద్ద ఎత్తున అక్క మీరు రాజకీయ పార్టీ పెట్టాలి మా పక్షాన నిలబడాలి మాకు నీతోనే న్యాయం జరుగుతది అని ప్రజల నుంచి పెద్ద ఎత్తున పిలుపు వచ్చిన క్రమంలో కవితక్క తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇరవై ఒక్క కమిటీలు వేసి మాజీ ఐఏఎస్ లతో ప్రజాసంఘాలతో మేధావులతో చర్చించి పది సంవత్సరాల బిఎస్ పాలనలో ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదు ఇప్పుడున్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలు ఇచ్చి రెండు సంవత్సరాల కాలంలో ప్రజా వ్యతిరేకత కూడగట్టుకుని ప్రజలను ఇబ్బందులు పెడుతున్న క్రమంలో ఈ రెండు పార్టీలు ఈ రాష్ట్రానికి పట్టిన చీడపీడలుగా గుర్తించి సామాజిక తెలంగాణ ధ్యేయంగా సబ్బండ వర్గాలకు ఉపయోగపడే విధంగా ఒక కొత్త మేనిఫెస్టోను రూపొందించి ఈనెల 25 తారీఖు నాడు మేడ్చల్ జిల్లా మునిరాబాద్ లోని అద్వైయ కన్వెన్షన్ లో పెద్ద ఎత్తున పార్టీ ఆవిర్భావం చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది కాబట్టి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని యువతి యువకులు విద్యార్థులు మహిళలు నిరుద్యోగులు, రైతులు ఉద్యమకారులు పెద్ద ఎత్తున ఈ పార్టీ ఆవిర్భావ సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి జిల్లా ఉపాధ్యక్షులు సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి వర్ధ సతీష్ కుమార్, వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి నూనె మల్లేష్ యాదవ్, ఎల్లారెడ్డిపేట మండల ఇన్చార్జి కదిరే భాస్కర్ గౌడ్, గంభీరావుపేట మండల ఇన్చార్జి కూర సురేష్ ఆటో యూనియన్ సిరిసిల్ల అధ్యక్షులు వీరబత్తిని రమేష్ సిరిసిల్ల టౌన్ ఇన్చార్జి కుసుమ విష్ణు కోనరావుపేట మండల ఇన్చార్జి కులేరు వినయ్ చందుర్తి మండల ఇన్చార్జి సలేంద్ర నవీన్ వేములవాడ టౌన్ ఇన్చార్జి తోట కనకయ్య ముస్తాబాద్ మండల ఇన్చార్జి ఎడ్ల రమేష్ జాగృతి సీనియర్ నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి బొమ్మ వరం రంగారావు యామన్నగారి పాపారావు గ ఓరుసు అశోక్ మార్వాడి దేవరాజు లింగం లింబాద్రి కామిండ్ల పూర్ణచందర్ వెంగళ అంకయ్య,మానుకాల రాము, మామిడాల శ్రీకాంత్, తోట రాజు, వావిలాల బిక్షపతి గారు తదితర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## కొండాపూర్ ప్రాథమిక పాఠశాలలో పట్టభద్రుల దినోత్సవం

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజా తీర్పు, ఎండపల్లి), ఏప్రిల్ 23:**

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని కొండాపూర్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పట్టభద్రుల దినోత్సవం (గ్రాడ్యుయేషన్ డే) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ మాట్లాడుతూ ప్రాథమిక విద్యా దశలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించుకోవడం అత్యంత హర్షనీయమని అన్నారు. పట్టభద్రుల దినోత్సవం అనేది ఒక విద్యార్థి ఒక దశ విద్యను పూర్తి చేసి, మరో కొత్త దశ విద్యకు నాంది పలికే శుభ ఘట్టమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెమెంటో, ప్రగతి నివేదిక (ప్రోగ్రెస్ కార్డు) లు అందజేసి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చుక్క మల్లికార్జున్ , వెల్గటూర్ ఉమ్మడి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి , మాజీ సింగిల్ విండో చైర్మన్ డి.రాజి రెడ్డి,ఉప సర్పంచ్ తనుగుల విజయ్, వార్డు సభ్యులు పోరెడ్డి రాంరెడ్డి, చిన్న అంజయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గుమ్మడి అరుణ, నాయకులు మన్నె జితేందర్, ఉపాధ్యాయులు ప్రణీత, లావణ్య, కిషోర్, రవీందర్,సత్తయ్య లతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## అసాధ్యమైన పనిని సాధించడానికి నిదర్శనం భగీరథుడు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వేముల వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల) ఏప్రిల్ 23**

నిరంతర ప్రయత్నం, అంకితభావం ఉంటే అసాధ్యమైన పనిని సాధించవచ్చు అని చూపిన మహనీయుడు భగీరథుడు అని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీ భగీరథ మహర్షి జయంతి ఉత్సవానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరై భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కష్టతరమైన పనిని సాధించడానికి భగీరథ మహర్షిని స్ఫూర్తిగా చూపిస్తామని, తరాలు మారిన భగీరథుడు సాధించిన విజయాన్ని స్మరిస్తూ ఉంటామని తెలిపారు. తలపెట్టిన పనిని పూర్తి చేసే వరకు ఎంత కాలమైనా అంకితభావంతో ప్రయత్నించాలని, భగీరథుడు ఆచరించి చూపారని తెలిపారు. మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడంలో భాగంగా ప్రభుత్వం అధికారికంగా వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో గాయపడిన నాయకులను పరామర్శించిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

**( చంద్రశేఖర్ ప్రజాతీర్పు బీర్పూర్) ఏప్రిల్ 23**

బీర్పూర్ మండలంలో చిత్రవేణి గూడెం సర్పంచ్ చిక్రం మారుతి, తాళ్ల ధర్మారం మాజీ సర్పంచ్ మహిపాల్ రెడ్డి కొల్వాయి గ్రామ నాయకులు రామకిస్తూ గంగాధర్ మరియు వారి కుమారుడు నిన్న రాత్రి బీర్పూర్ మండలం కొల్వాయి వద్ద రోడ్డు ప్రమాదంలో కారు చెట్టుకు ఢీకొని గాయపడగా వారిని కరీంనగర్ లో వేరు వేరు ప్రైవేట్ ఆస్పత్రిలలో చికిత్స పొందుతూ ఉండగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ వెంట బీర్పూర్ మండల నాయకులు తదితరులు ఉన్నారు.

## మంథని డిపోలో జెఏసి సమ్మె రెండో రోజు విజయవంతం

**మంథని, ఏప్రిల్-23(ప్రజాతీర్పు)**




మంథని డిపోలో జెఏసి ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె రెండో రోజు కూడా ఉధృతంగా కొనసాగి విజయవంతమైంది. కార్మికులు భారీ సంఖ్యలో డిపో వద్దకు చేరుకొని తమ డిమాండ్ల సాధన కోసం నిరసన వ్యక్తం చేశారు. "హమారే మంగే నై దియే తో బస్ కపయ్య నై చాలేగా" అంటూ నినాదాలు చేస్తూ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని వ్యతిరేకించారు. ప్రభుత్వం మొండివైఖరిని ఎండగట్టారు. ఈ సమ్మెకు మద్దతుగా బిఆర్ఎస్ మాజీ శాసనసభ్యులు పుట్ట మధుకర్, భూపాలపల్లి మాజీ జడ్పీటిసి జక్కు శ్రీహర్షిని, నాయకులు శంకర్ గౌడ్, రాజ్ గౌడ్, తగరం శంకర్ లాల్, మంథని లక్ష్మణ్, మిరియాల ప్రసాదరావు, తిరుపతి, అత్తే చంద్రమౌళి, శంకేశి రవీందర్ పాల్గొన్నారు. జెఏసి చైర్మన్ కెకె రెడ్డి, వైస్ చైర్మన్లు ఐలయ్య, ఖాదర్, కన్వీనర్ గంధం రమేష్, కో-కన్వీనర్లు ఖుతుబుద్దీన్, జనార్ధన్, సదయ్య, పోచయ్య, జెడి నాయక్, గోపాల్, మహిళా కార్యదర్శి ఇంతియాజ్ బేగం కూడా పాల్గొన్నారు. ఇంకా పెద్ద సంఖ్యలో కార్మికులు సమ్మెలో పాల్గొని తమ ఐక్యతను ప్రదర్శించారు.

# రైతుకు అండగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం

- ఇది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం
- జూబ్లీ నగర్, ఫకీర్ పేట్ వద్ద కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**కరీంనగర్, ఏప్రిల్ 23 (ప్రజాతీర్పు)**




రైతులకు ఎల్లప్పుడూ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పండించిన ధాన్యం అమ్ముకోవడానికి గతంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్, ఫకీర్ పేట్ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభి రైతులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా అనేక ఇబ్బందులు పెట్టారని తప్ప, తాలు పేరు మీద అనేక ఇబ్బందులు పెట్టారని నరేందర్ రెడ్డి అన్నారు. రైతును రాజును చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని గత ప్రభుత్వం ఎనిమిది లక్షల కోట్ల అప్పుల ఖజానా అప్పజెప్పినా రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుకు అండగా నిలవడం కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని నరేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమాలలో ఎపిఎం రామ్మోహన్, సిసి లు కృష్ణ, అశోక్, పిఏసిఎస్ సిఇఓ రమేష్, సర్పంచులు సుద్దాల కమలాకర్, బొద్దుల విజయ లక్ష్మి లక్ష్మణ్, వివో సునీత తదితరులు పాల్గొన్నారు.




# బతుకుదెరువు కోరితే బేడీలా?

- ఆర్టీసీ కార్మికులపై సర్కారు 'యుద్ధం'!
- సంక్షేమమా? సంక్షోభమా? ఆర్టీసీని కుప్పకూలుస్తున్న 'ముందు వెనుక' లేని నిర్ణయాలు!
- అణచివేత ధోరణిలో పాలకుల అరాచక పర్వం

**భైంసా, ఏప్రిల్ 23 (ప్రజా తీర్పు)**

రాష్ట్ర రవాణా వ్యవస్థకు వెన్నెముక, సామాన్యుడి ప్రాణనాడి అయిన ఆర్టీసీ నేడు ఒక భయంకరమైన యుద్ధ క్షేత్రాన్ని తలపిస్తోంది. తమ న్యాయమైన హక్కుల కోసం, ఆకలి కేకల పరిష్కారం కోసం రోడ్డెక్కిన కార్మికులపై ప్రభుత్వం కనికరం లేని యుద్ధం ప్రకటించింది. సమ్మె రెండో రోజుకు చేరుకోవడంతో ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించాల్సింది పోయి, పోలీసు బలగాలతో అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టుగా మారింది. బతుకుదెరువు కోరితే బేడీలు వేస్తారా అని కార్మిక లోకం నేడు పాలకులను నిలదీస్తోంది. ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని రంగుల కలలు చూపిన పాలకులు గద్దెనెక్కిన తర్వాత వారిని అంటరానివారిలా చూడటం శోచనీయం. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ మరియు ఇతర బకాయిల గురించి అడిగితే అది పెద్ద నేరం అన్నట్లుగా ప్రభుత్వం ప్రవర్తిస్తోంది. కార్మికులు అడుగుతున్నది విలాసవంతమైన భవంతులు కాదు, వారు చిందించిన చెమటకు తగిన ప్రతిఫలం మరియు గౌరవప్రదమైన బతుకుదెరువు మాత్రమే. కానీ చర్చలకు పిలవాల్సిన పాలకులు వారిపై అక్రమ కేసులు పెట్టడం మరియు అరెస్టులు చేయడం వారి అహంకారానికి పరాకాష్టగా కనిపిస్తోంది. ప్రభుత్వం ప్రస్తుతం తీసుకుంటున్న నిర్ణయాలు అశాస్త్రీయంగా, కేవలం రాజకీయ లబ్ధి కోసమే అన్నట్లుగా ఉండటం వల్ల సంస్థ ఆర్థికంగా కుప్పకూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆర్టీసీపై పెను ఆర్థిక భారం పడింది. ఆ నష్టాన్ని భర్తీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం మొండిచేయి చూపుతోంది. ఇప్పుడు సమ్మె తీవ్రతను తగ్గించడానికి మరియు జనం నుంచి వ్యతిరేకత రాకుండా ఉండటానికి పురుషులకు కూడా ఉచితం అని ప్రకటించడం అత్యంత హాస్యాస్పదంగా ఉంది. పైసా ఆదాయం రాకుండా కేవలం పంతం కోసం బస్సులను నడపడం అంటే సంస్థను నిలువునా సమాధి చేయడమే అవుతుంది. డీజిల్ కొనేందుకు మరియు కనీస మరమ్మతులకు కూడా నిధులు లేని స్థితిలో ఈ ఉచితాల నాటకం ఎవరి కోసమని మేధావులు ప్రశ్నిస్తున్నారు. సమ్మెను విచ్ఛిన్నం చేసే క్రమంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అత్యంత ప్రమాదకరంగా ఉంది. అనుభవం లేని తాత్కాలిక డ్రైవర్లు మరియు ప్రైవేటు వ్యక్తులకు భారీ వాహనాల స్టీరింగ్ అప్పగించి ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేసి మొండిగా బస్సులు నడపడం ద్వారా ప్రభుత్వం తన అసమర్థతను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోంది తప్ప సమస్య పరిష్కారం వైపు అడుగులు వేయడం లేదు.ఆర్థిక లోటు మరియు వ్యవస్థాగత విధ్వంసం.?ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయాల వల్ల రాష్ట్ర ఖజానాకు మరియు ఆర్టీసీకి జరుగుతున్న నష్టం అంచనాలకు అందడం లేదు. సాధారణంగా ఆర్టీసీకి వచ్చే ఆదాయంలో మెజారిటీ భాగం పురుష ప్రయాణికుల నుంచే వస్తుంది. ఇప్పటికే మహిళలకు ఉచితం చేయడం వల్ల సగం ఆదాయం గాలిలో కలిసిపోయింది. ఇప్పుడు సమ్మెను సాకుగా చూపి పురుషులకు కూడా ఉచిత ప్రయాణం కల్పించడం అంటే, సంస్థ గొంతును ప్రభుత్వం తన స్వహస్తాలతో నొక్కేయడమే. టికెట్ ఆదాయం సున్నాకి పడిపోయిన వేళ, రోజువారీ డీజిల్ ఖర్చులు, తాత్కాలిక సిబ్బందికి ఇచ్చే అదనపు వేతనాలు, బస్సుల తరుగుదల (విలువ తగ్గుదల)వంటివి సంస్థను కోలుకోలేని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయి.ఇది కేవలం ఆర్థిక లోటు మాత్రమే కాదు, ఒక సామాజిక ఆస్తిని పనిగట్టుకుని ధ్వంసం చేయడం. సంక్షేమం పేరుతో ఉచితాలు ప్రకటించడం తేలికే కానీ, వాటి వల్ల కలిగే లోటును పూడ్చడానికి మళ్ళీ ప్రజల మీద పన్నుల భారం వేయడమే ప్రభుత్వ వ్యూహంగా కనిపిస్తోంది. ఒకవైపు కార్మికులకు జీతాలు ఇవ్వడానికి నిధులు లేవని చెప్తూ, మరోవైపు కోట్లాది రూపాయల ఆదాయాన్ని వదులుకోవడం పాలకుల ద్వంద్వ నీతికి నిదర్శనం.

### ఉచితాల అశాస్త్రీయత పెరుగుతున్న నిరసనలు

ఆర్టీసీని కేవలం రాజకీయ ప్రయోగశాలగా మార్చడంపై పౌర సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సంక్షేమం అనేది ప్రజల అవసరాలను తీర్చేదిగా ఉండాలి కానీ, ఒక వ్యవస్థను భస్మం చేసేదిగా ఉండకూడదు. అశాస్త్రీయమైన ఉచిత పథకాలను వెంటనే ఎత్తివేయాలని, సంస్థను స్వయం సమృద్ధి దిశగా నడిపించాలని డిమాండ్ పెరుగుతోంది. ఒకవేళ ఉచిత పథకాలు,కొనసాగించాలనుకుంటే, దానికి తగిన నిధులను ముందే ఆర్టీసీకి చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అలా కాకుండా, సంస్థను నష్టాల ఊబిలోకి నెట్టి, చివరకు చేతులెత్తేయడమే పాలకుల అంతిమ వ్యూహంలా కనిపిస్తోంది. ఇది కేవలం ఆర్టీసీని నిర్వీర్యం చేసి భవిష్యత్తులో ప్రైవేటు పరం చేసేందుకే ప్రభుత్వం ఆడుతున్న ఒక పెద్ద మైండ్ గేమ్ అని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. పన్ను చెల్లింపుదారుల సొమ్మును ఓట్ల కోసం తగలేస్తూ రేపు ఈ సంస్థ మూతబడితే లక్షలాది మంది కార్మికుల కుటుంబాలు వీధిన పడతాయి. సమ్మెను అణచివేయడానికి చేసే ఖర్చులో సగం కార్మికులకు ఇచ్చి ఉంటే సమస్య ఎప్పుడో పరిష్కారమయ్యేది. ?ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులు అన్న విషయాన్ని పాలకులు గుర్తుంచుకుంటే మంచిది. లేదంటే రోడ్లపైకి వస్తున్న కార్మికుల ఆగ్రహం అనే జ్వాలల్లో పాలకుల కుర్చీలు కాలిపోవడం ఖాయం. వ్యవస్థలను నిర్మించడానికి దశాబ్దాల కాలం పడుతుంది కానీ వాటిని నాశనం చేయడానికి ఒక్క తప్పుడు నిర్ణయం చాలు అన్న వాస్తవాన్ని పాలకులు ఇప్పటికైనా గ్రహించి తమ మొండి వైఖరిని పక్కన పెట్టి ఆర్టీసీని కాపాడాలని కోరుకుందాం. నేడు మీరు చేస్తున్న ఈ ఆర్థిక మరియు వ్యవస్థాగత విధ్వంసానికి చరిత్ర మిమ్మల్ని ఎన్నటికీ క్షమించదు. పాలకులు ఇప్పటికైనా కళ్ళు తెరిచి వాస్తవ పరిస్థితులను గమనించి కార్మికులతో గౌరవప్రదంగా చర్చలు జరపడం ద్వారా ఈ సంక్షోభానికి ముగింపు పలకాలి. రాజకీయ స్వార్థం కంటే వ్యవస్థల మనుగడ ముఖ్యమని గుర్తించడమే అసలైన రాజధర్మం. ఈ అనాలోచిత 'ఉచిత' ప్రయోగాలు వ్యవస్థలను పాతాళానికి తొక్కే లోపే మేల్కొనకపోతే, భావి తరాలు మిమ్మల్ని నిందిస్తాయి. ప్రభుత్వం ఇప్పటికైనా దిగి వచ్చి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి, లేదంటే ఈ ఆర్థిక లోటు రాష్ట్రాన్ని చీకట్లోకి నెట్టడం ఖాయం.





వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
9848559863

# హుజూర్ నగర్ ఏరియా ఆసుపత్రికి ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- తనిఖీ సమయంలో అందుబాటులో లేని డాక్టర్లు
- డాక్టర్ల గైర్హాజరు పట్ల కలెక్టర్ ఆగ్రహం
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**(మధు,ప్రజాతీర్పు సూర్యాపేట)ఏప్రిల్ /23**



ప్రభుత్వ ఆసుపత్రిలలో వైద్యులు రోగులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని,లేదంటే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. గురువారం హుజుర్ నగర్ (ప్రాంతీయ వైద్యశాల)ఏరియా ఆసుపత్రికి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ఆసుపత్రిని తనిఖీ చేసిన సమయంలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది సమయం కాకముందే విధుల నుంచి వెళ్లిపోవడంపై కలెక్టర్ వివరాలను ఆరా తీశారు. అనంతరం డయాలసిస్ కేంద్రం,బ్లడ్ బాంక్ కేంద్రలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు విధి నిర్వహణలో సమయానికి రోగులకు అందుబాటులో ఉండాలని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఓపి విభాగంలో సమయపాలన పాటించని డాక్టర్లను,కాంట్రాక్టు డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సంబంధిత సూపరెండేంట్ ని ఆదేశించారు. ఇందుకు సంబంధించి పూర్తి నివేదికను అందించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని. సాధారణ ప్రసవాలు అధికంగా జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,పారిశుధ్య నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈసందర్భంగా ఆసుపత్రి పారిశుధ్య నిర్వహణపై శానిటేషన్ సిబ్బందిని,నర్సింగ్ ఆఫీసర్లను అభినందించారు. కాయకల్పలో అవార్డ్ పొందాలని ఆకాక్షించారు. మెరుగ్గా పారిశుధ్య పనులను నిర్వహించి ఆసుపత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగం, ఓపి విభాగం,బ్లడ్ స్టోరేజి విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న ఓపి బ్లాక్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సిటీ స్కాన్ మిషన్ పని తీరును పర్యవేక్షించారు. టి హబ్ నిర్వహణలో ఉన్న లోపాలను అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరిం చాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, సూపరెండేంట్ డాక్టర్ శ్రవణ్ కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ రవి కుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ వనజ, వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు,శానిటేషన్ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన 'పోషణ్ పక్వాడ' వేడుకలు

### అంగన్‌వాడీ చిన్నారుల 'గ్రాడ్యుయేషన్ డే' సందడి

**(కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల్) ఏప్రిల్23**

ఐసీడీఎస్ జగిత్యాల ప్రాజెక్ట్, పొలాస సెక్టార్ పరిధిలోని ధర్మారం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషణ్ పక్వాడ' ముగింపు ఉత్సవం మరియు అంగన్‌వాడీ ప్రీ-స్కూల్ 'గ్రాడ్యుయేషన్ డే' వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. గ్రామ సర్పంచ్ పరమల సుమలత మల్లేష్, ఉపసర్పంచ్ దీకొండ ప్రేమ్ నాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు, తల్లులు మరియు అంగన్‌వాడీ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. పోషణ్ పక్వాడ ?ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, 2018లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పోషణ్ పక్వాడ ముఖ్య ఉద్దేశ్యం దేశ జనాభా ఆరోగ్యాన్ని మెరుగుపరచడమేనని తెలిపారు. గ్రామ ఆరోగ్య పారిశుధ్య పోషకాహార దినోత్సవం) లో భాగంగా పిల్లల ఎత్తు, బరువులను నమోదు చేసి, లోప పోషణ మరియు అతి తీవ్ర లోప పోషణ ఉన్న పిల్లలను గుర్తించి తగు జాగ్రత్తలు సూచించారు. పోషకాహార అలవాట్లలో మార్పు కోసం వివిధ రకాల పోషకాలున్న ఆహార పదార్థాలను 'ప్రత్యక్ష ప్రదర్శన' ద్వారా వివరించారు. నీటి సమతుల్యత కోసం పిల్లలకు తరచూ నీరు, పాలు, మరియు పండ్ల రసాలు అందించాలని తల్లులకు అవగాహన కల్పించారు. ?చిన్నారుల వికాసానికి 'గ్రాడ్యుయేషన్ డే' ?అంగన్‌వాడీ ప్రీ-స్కూల్ పూర్తి చేసుకుని ప్రాథమిక పాఠశాలకు సిద్ధమైన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ?"పిల్లల అభివృద్ధి నివేదికల ఆధారంగా వారికి స్టార్స్ కేటాయించి, తల్లిదండ్రుల సమక్షంలో వారి ప్రతిభను గుర్తించడం సంతోషకరం" అని సూపర్వైజర్ రాజశ్రీ తెలిపారు. ?చిన్నారులు తయారు చేసిన బొమ్మలు, ఇసుకతో ఆటలు వంటి స్వేచ్ఛయుత కార్యకలాపాల ద్వారా వారి శారీరక మానసిక మెదడు వికాసం పెరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ?సెల్ ఫోన్ వాడకంపై హెచ్చరిక ?పిల్లలు అతిగా సెల్ ఫోన్ వాడటం వల్ల కలిగే నష్టాలపై సూపర్వైజర్ ఆందోళన వ్యక్తం చేశారు. ?కంటి చూపు మందగించడం, నిద్రలేమి, తలనొప్పి. ?మెడ నొప్పి, అలసట ఆలోచనా శక్తి తగ్గడం. ?చర్మ సంబంధిత అలర్జీలు వచ్చే ప్రమాదం ఉందని తల్లిదండ్రులను హెచ్చరించారు. ?ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరమల సుమలత మల్లేష్, ఉప సర్పంచ్ దీకొండ ప్రేమ్ నాథ్, అంగన్‌వాడీ టీచర్ సరితారావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు రజిత, మహిళా అధ్యక్షురాలు హేమలత,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే..

- విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న అక్షర ఉన్నత పాఠశాల.
- పాఠశాల కరస్పాండెంట్ పైడి మారుతి.

**(చంద్రశేఖర్, ప్రజాతీర్పు బీర్పూర్ ) ఏప్రిల్23**

జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం కొల్వాయి గ్రామంలోని అక్షర ఉన్నత పాఠశాల మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. విద్యాబుద్ధులతో పాటు విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో అగ్రగామిగా నిలుస్తున్న ఈ పాఠశాలలో 'గ్రాడ్యుయేషన్ డే' వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ పైడి మారుతి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పైడి మారుతి మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత ప్రస్థానానికి పునాది గా'అక్షర' పాఠశాల పనిచేస్తుందని పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే అనేది కేవలం ఒక తరగతి పూర్తి చేయడం కాదని, అది విద్యార్థుల జీవితంలో ఒక ఉన్నతమైన ప్రయాణానికి ఆరంభమని పేర్కొన్నారు. అక్షర పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు నేడు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని, డాక్టర్లు, ఇంజనీర్లుగా మరియు వివిధ రంగాల్లో రాణిస్తూ పాఠశాల పేరును నిలబెడుతున్నారని ఆయన గర్వంగా తెలిపారు. కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. కొల్వాయి గ్రామంలోని ఈ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో రాజీ పడకుండా పనిచేస్తోంది. ఆధునిక బోధనా పద్ధతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మరియు విద్యార్థుల పట్ల కరస్పాండెంట్ మారుతి గారికి ఉన్న అంకితభావం కారణంగానే అక్షర హై స్కూల్ నేడు మండలంలోనే అత్యుత్తమ పాఠశాలగా గుర్తింపు పొందిందని తెలిపారు పూర్వ విద్యార్థులు సాధించిన విజయాలు అక్షర హై స్కూల్ విద్యా ప్రమాణాలకు నిలువుటద్దం అని తెలిపారు. గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో భాగంగా చిన్నారి విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభా పాటవాలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. తమ పిల్లలను ఇంత గొప్పగా తీర్చిదిద్దుతున్న పాఠశాల యాజమాన్యాన్ని, కరస్పాండెంట్ మారుతి ని వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

## నేడు ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయ్ కుమార్

**చిగురు మామిడి, ఏప్రిల్ 23 (ప్రజాతీర్పు)**



ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం, ఎలక్ట్రిక్ 3 వీలర్ వాహనం ఆటో, 2 పాడి పశువుల పథకం రుణాలకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రేపు అనగా 24-04-2026 న ధృవ పత్రాలను మండల స్థాయి కమిటీ పరిశీలన చేయబడును. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత ధృవ పత్రాలు ఎలక్ట్రిక్ వాహనాలకు దరఖాస్తు చేసుకున్న వారు డ్రైవింగ్ లైసెన్స్, కుల, ఆదాయ, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, 2 - పాడి పశువుల పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారు కుల,ఆదాయం,భూమి పట్టా పాసు పుస్తకం,బ్యాంక్ ఖాతా పుస్తకం,ఆధార్ కార్డుతో పాటు సంబంధిత ఒరిజినల్ తో పాటు జిరాక్స్ పత్రాలు వెంట తీసుకొని మండల పరిషత్ ప్రజా భవన కార్యాలయం, చిగురుమామిడి లో నిర్వహించే ఇంటర్వ్యూకు రేపు ఉదయం 10-00 లకు హాజరు కాగలరని కోరనైనది.

## విశాఖపట్నంలో ఘనంగా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ట్రైనర్ కాన్ఫరెన్స్

### ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలకు రీజినల్ ప్రెసిడెంట్-13గా వాడేకర్ లక్ష్మణ్ ఏకగ్రీవ ఎన్నిక

**(కపిల్ వాగ్మారే భైంసా,ప్రజా తీర్పు ) ఏప్రిల్ 23**



విశాఖపట్నం నగరంలో 20 మరియు 21 తేదీలలో నిర్వహించిన ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ట్రైనర్ కాన్ఫరెన్స్ అత్యంత ఘనంగా, విజయవంతంగా జరిగింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రముఖ ట్రైనర్లు, నాయకులు, సేవాభావం గల వ్యక్తులు పాల్గొన్న ఈ కాన్ఫరెన్స్‌లో పలు ముఖ్య నిర్ణయాలు తీసుకోగా, నాయకత్వ బాధ్యతల కోసం ఎన్నికలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ స్ఫూర్తి అధ్యక్షులు, ప్రముఖ మోటివేషనల్ ట్రైనర్ మరియు సమాజ సేవకుడు అయిన వాడేకర్ లక్ష్మణ్ గారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలకు రీజినల్ ప్రెసిడెంట్-13గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. ఆయనకు ఈ బాధ్యత ఇవ్వడం ద్వారా సంస్థ ఆయనపై ఉంచిన నమ్మకం స్పష్టంగా కనిపించింది. సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న నాయకుడు వాడేకర్ లక్ష్మణ్ గారు గత కొన్ని సంవత్సరాలుగా విద్యా మరియు వ్యక్తిత్వ వికాస రంగంలో అహర్నిశలు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్, నిర్మల్ మరియు పరిసర జిల్లాల్లోని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల్లో వేలాది మంది విద్యార్థులకు ఉచితంగా వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, జీవిత విలువలు పెంపొందించడానికి ఆయన చేపట్టిన కార్యక్రమాలు విశేష ఫలితాలు అందించాయి. అనేక మంది విద్యార్థులు ఆయన శిక్షణ ద్వారా ప్రేరణ పొందుతూ తమ జీవితాల్లో మార్పును సాధించారు. ట్రైనర్ల తయారీలో కీలక పాత్ర విద్యార్థులకే కాకుండా, ట్రైనర్ల తయారీలో కూడా వాడేకర్ లక్ష్మణ్ గారు కీలక పాత్ర పోషించారు. అనేకమంది యువతకు ట్రైనింగ్ ఇచ్చి, వారిని సమర్థవంతమైన ట్రైనర్లుగా తీర్చిదిద్దారు. ఈ విధంగా ఆయన ప్రభావం ఒక వ్యక్తి వరకు పరిమితం కాకుండా, సమాజవ్యాప్తంగా విస్తరించింది. సేవాకార్యక్రమాల్లో,ముందంజ విద్యా రంగంతో పాటు సమాజ సేవలో కూడా లక్ష్మణ్ గారు ఎప్పుడు ముందుంటారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేద ప్రజలకు, విద్యార్థులకు సహాయం అందిస్తున్నారు. ముఖ్యంగా ఉచిత శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు, సామాజిక సేవలు నిర్వహించడం ద్వారా సమాజంలో మంచి మార్పు తీసుకువస్తున్నారు.

**ప్రముఖుల చేత అపాయింట్మెంట్ లెటర్ అందజేత**

ఈ కాన్ఫరెన్స్‌లో ఇంపాక్ట్ ఫౌండర్ గంప నాగేశ్వర్ రావు గారు, పాస్ట్ నేషనల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ (సోను) గారు, నేషనల్ ప్రెసిడెంట్ కె. మాధవి గారు, ఓఎస్ రామచంద్రుడు గారు, ఎన్హెచ్‌బి శ్యాం రాథోడ్ గారు మరియు ఇతర ప్రముఖులు కలిసి వాడేకర్ లక్ష్మణ్ గారిని రీజినల్ ప్రెసిడెంట్-13గా అధికారికంగా ఎన్నుకుని అపాయింట్మెంట్ లెటర్ అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ లక్ష్మణ్ గారి సేవలు, కృషి, నాయకత్వం ప్రశంసనీయం అని కొనియాడారు.

**లక్ష్మణ్ గారి స్పందన**

ఈ సందర్భంగా వాడేకర్ లక్ష్మణ్ గారు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఈ గొప్ప బాధ్యతను అప్పగించిన ఇంపాక్ట్ కుటుంబానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల రీజినల్ ప్రెసిడెంట్ 13గా నా బాధ్యతలు మరింత పెరిగాయి. ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ మరింత మంది యువత, విద్యార్థుల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడానికి కృషి చేస్తాను" అని తెలిపారు. అలాగే ఆయన సంస్థ అభివృద్ధి కోసం, సమాజ సేవ కోసం తన పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. జిల్లాకు గౌరవ,యువతకు ప్రేరణ,వాడేకర్ లక్ష్మణ్ గారి ఎన్నికతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలకు గౌరవం దక్కిందని, ఆయన ప్రయాణం యువతకు గొప్ప ప్రేరణగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. సాధారణ కుటుంబం నుండి ప్రారంభమైన ఆయన ప్రయాణం, కృషి, సేవాభావం ద్వారా ఈ స్థాయికి చేరుకోవడం నిజంగా అభినందనీయమని తెలిపారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ట్రైనర్ కాన్ఫరెన్స్‌లో వాడేకర్ లక్ష్మణ్ గారి ఏకగ్రీవ ఎన్నిక సంస్థకు, సమాజానికి మరింత సేవ చేయాలనే సంకల్పానికి నిదర్శనం. ఆయన నాయకత్వంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు, శిక్షణలు నిర్వహించి సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తమవుతోంది.

## ఆర్జీ-1లో ఎయిర్ కూలర్లు వెంటనే ఏర్పాటు చేయాలి

### ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను డిమాండ్

**గోదావరిఖని, ఏప్రిల్ 23 ( ప్రజాతీర్పు):**



సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో పని చేస్తున్న కార్మికులకు వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మైన్స్, డిపార్ట్‌మెంట్‌లలో ఎయిర్ కూలర్లు వెంటనే ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను డిమాండ్ చేశారు. గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ... ప్రతి ఏడాది మార్చి నెల నుంచే ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఈసారి రెండు నెలలు గడిచినా యాజమాన్యం ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం పట్ల కార్మికుల్లో తీవ్ర అసహనం నెలకొన్నదని తెలిపారు. ఈ అంశాన్ని గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. వెంటనే మైన్స్, డిపార్ట్‌మెంట్‌లలో ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేసి కార్మికులకు ఉపశమనం కల్పించాలని కోరారు. లేదంటే కార్మికుల తరపున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని రంగు శ్రీను హెచ్చరించారు.

## తక్షణమే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

### డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి

**కరీంనగర్, ఏప్రిల్ 23 (ప్రజాతీర్పు)**



రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగాలుగా గుర్తించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. తిరుపతి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం వల్ల నర్సంపేట బస్ డ్రైవర్ ఆత్మహత్యయత్నానికి పాల్పడడం చాలా బాధాకరమని ఆయన అన్నారు. ఆర్టీసీ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడకుండా తక్షణమే వారి సమస్యలు పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని తిరుపతి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో రాకముందు ఆర్టీసీ కార్మికులకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయకుండా కాలయాపన చేయడం వెనుక సంస్థను ప్రైవేటుకరించే కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ఆర్టీసీ కార్మికుల పట్ల మొండి వైఖరి వీడి కమిటిల పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే ఆర్టీసీ జేఏసీ నాయకులతో చర్చలు జరిపి 32 డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆయన అన్నారు. ఆర్టీసీలో ఉద్యోగ నోటిఫికేషన్ లేకపోవడం వల్ల రానున్న రోజుల్లో యువత ఉద్యోగాలు భర్తీలో నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి తక్షణమే ఆర్టీసీ కార్మికులపై చిత్తశుద్ధి ఉంటే వారి సమస్యలు పరిష్కరించి బస్సులు నడిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వము బస్సులు నడపకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతున్నారని ఆయన వ్యక్తం చేశారు. తక్షణమే ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

## రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి

### అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**(రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజాతీర్పు వేములవాడ )ఏప్రిల్ 23**



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. గురువారం వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి, మల్లారం, వేములవాడ పట్టణంలోని బాలా నగర్ లో ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం సేకరించారు? ఆన్ లైన్ లో వెంటనే నమోదు చేశారా లేదా? అనే వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసున్నారు. రైతుల సౌకర్యార్థం చేసిన ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. తేమ శాతాన్ని పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్ళు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్షాలు పడితే ఇబ్బందులు కలగకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

**ధాన్యం ఎప్పటికప్పుడు దింపుకోవాలి**

ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి తీసుకువచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దింపుకోవాలి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ రైస్ మిల్ నిర్వాహకులకు సూచించారు. మర్రిపల్లిలోని మణికంత ఇండస్ట్రీస్, మారుతి ఇండస్ట్రీస్ లు, వేములవాడ పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. మిల్లులకు ధాన్యం లోడ్ తో వచ్చిన వాహనాలను ఆలస్యం చేయకుండా దింపుకొని వాహనాలు తిరిగి కొనుగోలు కేంద్రాలను వెళ్లేలా సహకరించాలన్నారు.

# భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వేముల,వెంకటేష్,ప్రజా తీర్పు మంచిర్యాల స్థాప రిపోర్టర్) ఏప్రిల్ 23**



వివిధ భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులలో ప్రజలు అందించిన దరఖాస్తుల పరిష్కారం ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి భూ భారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రకాల భూ సమస్యలపై అర్జీదారులు అందించిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం దిశగా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని తెలిపారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని కన్నెపల్లి తహసిల్దార్ కార్యాలయాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్, కన్నేపల్లి మండల తహసిల్దార్ రామచందర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ లతో కలిసి సందర్శించి భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ, కార్యాలయ పరిధిలో జరిగిన రిజిస్ట్రేషన్ల రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి ప్రహరీ గోడ, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచసే విధంగా చర్యలు తీసుకోవాలని, పాఠశాలలో మూత్రశాలలో నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా చేపడుతున్న చర్యలలో భాగంగా జిల్లాలోని పాఠశాలలలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం నెన్నెల, తాండూర్ మండలాల తహసిల్దార్ల కార్యాలయాలను సందర్శించి ఆయా మండలాల తహసిల్దార్లు శ్రీనివాస్, జ్యోత్స్న లతో భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించి పరిష్కార ప్రక్రియ ప్రభుత్వా నబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. వివిధ పనుల నిమిత్తం ఆయా కార్యాలయాలకు వచ్చిన ప్రజలతో మాట్లాడి వారు వచ్చిన కారణాలను తెలుసుకొని దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## శ్రీ రేణుక ఎల్లమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్

**(మొక్క ఉపేందర్, ప్రజాతీర్పు హైదరాబాద్) ఏప్రిల్22**

మేడ్చల్ జిల్లా జిహెచ్ఎంసి ఉప్పల్ జోన్ చెంగిచెర్ల కమాన్, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఆపోజిట్, పిల్లర్ నెంబర్ 132 వద్ద మేడిపల్లి మంచాల కాలనీలో నిత్యవసర సరుకులు అందజేయడానికి వస్తున్న ఓల్డ్ సిటీ సూర్య బాయ్ (గోల్డ్ మాన్), అలాగే వికలాంగుల కాంగ్రెస్ మేనిఫెస్టో సాధన సమితి చైర్మన్ చెరుకు నాగభూషణం, మరుగుజ్జు సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్, ఈ కార్యక్రమం శ్రీ రేణుక ఎల్లమ్మ ఫౌండేషన్ చైర్మన్ వల్లాల రేణుక భర్త సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ప్రతినెలా చేయడానికి రేణుక ఎల్లమ్మ ఫౌండేషన్ ముందుంటుంది అని తెలియజేశారు. ఇందులో భాగంగా టిఎక్స్ హాస్పిటల్ వారు బాలరాజు అండ్ టీం హెల్త్ క్యాంప్ కూడా నిర్వహించడం జరిగింది. ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ మోదాల అరుణ సైదులు, ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల జేఏసీ నాయకుడు మొక్క ఉపేందర్, డిజేబుల్ రైట్ యాక్టివిస్ట్ వేణు గౌడ్, రాష్ట్రా లెప్రసీ సంఘం నాయకుడు రమేష్, విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షులు గొల్ల పాండు యాదవ్, తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సంఘం మొరిగాడి నరసింహ గౌడ్,సోషల్ ఆక్టివేట్ దానమ్మ, మాధవి, గంగమ్మ పద్మ రేణుక తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా కేఎల్ఆర్ జన్మదిన వేడుకలు

### మాతృదేవోభవ అనాధాశ్రమంలో అన్నదానం

**(వై యాదగిరి, ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) ఏప్రిల్.23**



మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించారు.నాదర్ గుల్ మాతృదేవోభవ అనాధా శ్రమంలో అన్నదానం కార్యక్రమం.. మర్రి శశాంక్ రెడ్డి ఆధ్వర్యంలో చేశారు. అంతకు ముందు పూజ క్రతువు నిర్వహించారు. ప్రజా సేవలో నిండునూరేళ్లు ఉండేలా దేవుడి ఆశీస్సులు కిచ్చెన్నగారిపై ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సహా స్థానిక కార్యకర్తలు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

## కొత్త అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా శ్రీనివాస్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

**కరీంనగర్, ఏప్రిల్ 23 (ప్రజాతీర్పు)**



కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా డి. శ్రీనివాస్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు రేరాలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను ఇటీవల కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ గా నియమించింది. ఈ నేపథ్యంలో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా జిల్లాలోని రెవెన్యూ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలపై పలు అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కె. మహేశ్వర్‌తో పాటు పలువురు రెవెన్యూ అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు శ్రీనివాస్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో సుధాకర్, కరీంనగర్ అర్బన్ తహసిల్దార్ నరేందర్, రాజేష్, కాళీచరణ్ పాల్గొన్నారు.




## ఘనంగా సత్యసాయి ఆరాధన మహోత్సవం

### 'స్పందన' అనాధ శరణాలయానికి ఆర్థిక సాయం.

**జమ్మికుంట ఏప్రిల్ 23 (ప్రజాతీర్పు)**

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి 15వ ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకొని , స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం నాడు విశేష సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక 'స్పందన అనాధ శరణాలయం' లోని చిన్నారులకు స్వామివారి ప్రేమ కానుకగా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. సమితి కన్వీనర్ గన్ను సతీష్ కుమార్ మాట్లాడుతూ, బాబా చూపిన 'మానవ సేవయే మాధవ సేవ' అనే మార్గంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. శరణాలయం నిర్వహణ ఖర్చుల నిమిత్తం సుమారు 6,000/- రూపాయల నగదును నిర్వాహకులకు అందజేశారు. అనంతరం శరణాలయ పిల్లలందరికీ ఎంతో ప్రేమతో ఐస్‌క్రీమ్‌లను పంపిణీ చేసి వారితో సమయాన్ని గడిపారు. ఈ సేవా కార్యక్రమంలో సమితి కన్వీనర్ గన్ను సతీష్ కుమార్ తో పాటు, మహిళా యువ సమన్వయకర్త సాయి మాధురి, సాయి సత్య శ్రీ, సాయి నిత్యశ్రీ, బచ్చు సాయికృష్ణ ఇతర సాయి భక్తులు పాల్గొన్నారు. చిన్నారుల ముఖాల్లోని చిరునవ్వులే స్వామికి అందించే నిజమైన నివాళి అని ఈ సందర్భంగా సభ్యులు పేర్కొన్నారు.



## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) ఏప్రిల్ 23:**

వేములవాడ పట్టణం 12 వ వార్డ్ లో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి నూతన వస్త్రాలు అందజేశారు. చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో వేములవాడ మున్సిపాలిటీలో ఇప్పటి వరకు 484 మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు కాగా రానున్న రోజులలో అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదాలకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రామతీర్థపు కృష్ణవేణి హరీష్, తుమ్ మధు, కొక్కుల బాలకృష్ణ, హౌసింగ్ ఏఈ సౌజన్య, వార్డ్ ఆఫీసర్ రొండి వెంకటేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## వరి ధాన్యాన్ని వ్యవసాయ క్షేత్రాల వద్ద ఆరబెట్టిన తర్వాతనే వరి ధాన్యము కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి

### జిల్లా కలెక్టర్ కె. హైమావతి

**సిద్దిపేట, ఏప్రిల్ 23 (ప్రజాతీర్పు)**

గురువారం నంగునూరు మండలం పాలమాకుల మరియు చిన్నకోడూర్ మండలం గోనెపల్లి, పెద్ద కోడూరు గ్రామంలో గల వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు వరి కోత చేయగానే కొనుగోలు కేంద్రానికి కాకుండా వ్యవసాయ క్షేత్రాల వద్దనే తేమ శాతం వచ్చే వరకు అరబెట్టుకుని కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అలాగే సెంటర్ సిబ్బంది పై సమాచారాన్ని గ్రామాల్లోని ప్రతి ఒక్క రైతుకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల్లో గన్ని బ్యాగ్ లు, తేమ శాతం కొలిచే యంత్రాలు, కంతాల, పాడి క్లీనర్లు, వేసవి కాలం దృష్టా కుండలో తాగునీటి వసతి, అకాల వర్షాలు వల్ల ధాన్యం తడవకుండా టార్పలిన్ షీట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. తేమశాతం చెక్ చేసి తేమశాతం రాగానే వెంటనే లోడ్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కేంద్రానికి కేటాయించిన మిల్లులలో ధాన్యం దిగుమతి లో జాప్యం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే అకాల వర్షాలు పడే ఆస్కారం ఉందని రాత్రి వేళల్లో ధాన్యంపైన టర్పాలిన్ కవర్లు తప్పనిసరిగా కప్పి ఉంచాలని రైతులకు సూచించారు.




## రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపికైన జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) ఏప్రిల్ 23**

పెద్దపల్లి అమర్ చంద్ కళ్యాణమండపంలో ఈనెల 22న నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్ 7, అండర్ 11 చదరంగం పోటీలలో కరీంనగర్ చెందిన జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు అండర్ 7 బాలికల విభాగంలో ఎం సాన్విత, కే అద్వైత, ఎన్ సాన్విత, బాలుర విభాగంలో శ్రీ హన్సిత్, కే శ్రేయాన్స్, ఏ శ్రేయన్స్, అండర్ 11 బాలికల విభాగంలో ఎస్ నేహిత, జి తన్వి, లక్ష్మీ నందిని, అండర్ 11 బాలుర విభాగంలో ఎన్ అశ్విన్, జటిన్ సిద్ధార్థ, సహర్ష్, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను గురువారం జ్యోతి నగర్ లోని జీనియస్ చెస్ అకాడమీలో వ్యవస్థాపక అధ్యక్షులు కంకటి కనకయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26 హైదరాబాదులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్, జీనియస్ చెస్ అకాడమీ కో డైరెక్టర్ కంకటి సుజన్ కుమార్, కరీంనగర్ డిస్ట్రిక్ట్ డెమొక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి తాటిపల్లి సతీష్ బాబు అకాడమీ కోచ్ లు అభిరామ్, రేవిక్, స్వాతి, శ్రీనిజ, చదరంగం క్రీడాకారులు పాల్గొన్నారు.

## బౌరంపేట్ స్నేక్ పార్క్ లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ఫారెస్ట్ ఆఫీసర్ కి వినతి..

**బౌరెంపేట్, ఏప్రిల్ 23 (ప్రజా తీర్పు)**



ఇటీవల బౌరంపేట్ లోని స్నేక్ పార్క్ లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ, శంభీపూర్ రాజు ని, బీఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ని బౌరంపేట్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోరారు. వెంటనే ఎమ్మెల్సీ ఎమ్మెల్యే స్పందించి మేడ్చల్ జిల్లా ఫారెస్ట్ అధికారి కి పార్క్ లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ ఎమ్మెల్సీ ఫోన్ లో అధికారితో మాట్లాడారు. మరియు వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కోరుతున్న ఎమ్మెల్యే సిఫాసు లేఖను మేడ్చల్ జిల్లా ఫారెస్ట్ అధికారి ని మర్యాదపూర్వకంగా కలిసి అందజేసిన బౌరంపేట్ ప్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్వి సురేందర్ రెడ్డి, సరుగారి ధర్మారెడ్డి, పల్పనూరి విష్ణువర్ధన్ రెడ్డి . ఈ సందర్భంగా ఫారెస్ట్ ఆఫీసర్ సానుకూలంగా స్పందిస్తూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు అధికారులతో చర్చించి ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు..

# స్థాయిని మించి విమర్శలు చేస్తే సహించేది లేదు

- కొప్పుల మోచేతి నీళ్లు తాగినోడు కూడా ఆయనను విమర్శించడమా..?
- ఖబర్దార్ కాంగ్రెస్ నాయకులారా.. నోరు అదుపులో పెట్టుకోండి
- ధర్మారం మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు ఎండపల్లి) ఏప్రిల్ 23**



తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను విమర్శించే నైతిక స్థాయి ధర్మారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదని, స్థాయిని మించిన విమర్శలు చేస్తే సహించేది లేదని ధర్మారం మండల భారత రాష్ట్ర సమితి(బిఆర్ఎస్) నాయకులు పేర్కొన్నారు. గురువారం ధర్మారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పై ధర్మారం మండల కాంగ్రెస్ నాయకులు చేసిన విమర్శలు కన్నతల్లి పాలు తాగి రొమ్ము గుద్దిన విధంగా కొంతమంది అజ్ఞాన కాంగ్రెస్ పార్టీ నాయకుల వ్యాఖ్యలున్నాయని అన్నారు. గతంలో బిఆర్ఎస్ పార్టీలో వివిధ రకాల పదవులు అనుభవించి, తన స్వార్థప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ లో చేరి, మంత్రి అడ్లూరి మెప్పుకోసం బతుకుదెరువునిచ్చిన కొప్పుల ఈశ్వరన్న పై విమర్శలు గుప్పించడం ఆ నాయకుని అవివేకానికి నిదర్శనమన్నారు. గత పరిషత్ ఎన్నికల్లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కాళ్ళు మొక్కి ధర్మారం మండల జెడ్పిటిసి టికెట్ పొంది, ఓటమిపాలైన కూడా వెంటనే వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి అప్పగించి ఆ నాయకునికి మేలు చేసిన ఘనత కొప్పుల ఈశ్వర్ దని వెల్లడించారు. అలాంటి నేత కొప్పుల ఈశ్వర్ ను విమర్శించడానికి కాంగ్రెస్ నాయకునికి నోరెలా వచ్చిందని,అది నాలుకనా.. తాటి మట్టనా..? అని ప్రశ్నించారు. గతంలో కొప్పుల ద్వారా లబ్ది పొంది ప్రస్తుతం అడ్లూరి పంచన చేరి కొప్పులను విమర్శిస్తున్న నాయకులు రేపటి రోజుల్లో అవకాశవాదం కోసం అడ్లూరిపై విమర్శలు చేయరా..? మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులారా ఖబర్దార్.. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పై స్థాయిని మించిన విమర్శలు చేస్తే సహించేది లేదని బిఆర్ఎస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడారం ప్యాక్స్ మాజీ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ సభ్యులు పూస్కూరి రామారావు, ఆవుల శ్రీనివాస్, ఎగ్గెల స్వామి, రాచూరి శ్రీధర్, తుమ్మల రాంబాబు యాదవ్, దొనికెన తిరుపతి గౌడ్, నాడెం శ్రీనివాస్, సామంతుల రాజమల్లయ్య, దేవి నళిని కాంత్, పాక వెంకటేశం, దేవి రమణ, ఐత వెంకటస్వామి, కారుపాకల రాజయ్య, అర్ధవెల్లి రాము, ఆవుల వేణుగోపాల్, పులి నవీన్, చేనెల్లి హరీష్, ఇజ్జగిరి రమేష్, ఆవుల లత, కాంపెల్లి అపర్ణ, మార్క సంధ్య తదితరులు పాల్గొన్నారు



# వృద్ధ తల్లిదండ్రుల పోషణ విస్మరిస్తే జైలు శిక్ష తప్పదు

- తెలంగాణ సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి), ఏప్రిల్ 23:**

తల్లిదండ్రులను వృద్ధాప్యంలో వారి పోషణను విస్మరిస్తే జైలు శిక్ష తప్పదని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ ఫోరం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ తెలిపారు. కోరుట్లలో తెలంగాణ సీనియర్ సిటిజన్స్ ఫోరం కోరుట్ల డివిజన్ అధ్యక్షులు సబ్బ సదానందం ఆధ్వర్యంలో కోరుట్ల, మేడిపల్లి, కథలాపూర్ మండలాల్లో వృద్ధ తల్లిదండ్రులను నిరాదరణకు గురి చేస్తున్న కొడుకులు, కోడళ్ళకు తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్ లో హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిరాదరణకు గురి చేస్తూ, వేధింపులకు పాల్పడుతూ, మానసిక క్షోభకు గురి చేస్తే సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారుల ద్వారా ఆరు నెలల జైలు శిక్షతోపాటు, తల్లిదండ్రుల నుండి పొందిన ఆస్తులను తిరిగి తల్లిదండ్రుల పేరిట పట్టా మార్పిడి చేయించబడుతుందని వెల్లడించారు. ఈ విషయమై జగిత్యాల డివిజన్ లో కొందరు అనుభవించిన జైలు శిక్ష గురించి కౌన్సిలింగ్ లో వృద్ధ తల్లిదండ్రుల కొడుకులు,కోడళ్ళకు వివరించారు. అనంతరం ఫిర్యాదుదారులైన వృద్ధ తల్లిదండ్రుల కొడుకులు తమ తల్లిదండ్రులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా, సక్రమంగా పోషించుకుంటామని బాండ్ పేపర్ల పై రాయించి సంతకాలు చేసి, తెలంగాణ సీనియర్ సిటిజన్స్ ఫోరంకు కృతజ్ఞతలు తెలిపి తమ తల్లిదండ్రులను తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కోరుట్ల డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక గంగారాం, ఉపాధ్యక్షుడు ఎండి. సైఫోద్దీన్, కోశాధికారి ఎన్. లక్ష్మీనారాయణ, అయిల్నేని వెంకటేశ్వరరావు, రాజయ్య, అల్లూరి బాపురెడ్డి, గౌరిశెట్టి విశ్వనాథ్, ఎండి. యాకూబ్,కరుణ తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం, మొక్క జొన్నల కొనుగోళ్ళను వేగవంతం చేయాలి

- కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎమ్ ఏ అన్వర్ పాషా

**హుస్నాబాద్, ఏప్రిల్ 23 (ప్రజాతీర్పు)**

రైతులు కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వెళ్తే రోజుల కొద్దీ కొనుగోలు కేంద్రంలోనే గడపాల్సి వస్తుందని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా అన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు అట్టసశీగా ప్రారంభిశీచి కొనుగోలు చేయడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. ప్రభుత్వం రైతులకు మేలు చేస్తున్నాం అని గొప్పలు చెప్పుకోవడమే గాని చేసేదేమీ లేదని, ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేక పోవడం వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రారంభించిన తరువాత వెంటనే మిల్లులు అలాట్ మెంట్ చేయాలి కానీ సరైన అలాట్ మెంట్ చేయకపోవడం వలన లోడింగ్ లో మిల్లర్లు, రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, మొక్క జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం జరిగి ఒక నెలన్నర గడిచినా 20 వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు జరిపినారని , ఇంకా కొనుగోలు కేంద్రంలోనే దాదాపు వెయ్యి క్వింటాళ్లు ఉన్నాయన్నారు. మొక్క జొన్న లు కొనుగోళ్లు సరిగా లేకపోవడం వలన రైతుల ఆర్థిక అవసరాల కోసం ప్రవేట్ వ్యాపారుల దగ్గర అమ్ముకొని నష్టపోతున్నారని, పొద్దు తిరుగుడు పంటను అమ్ముకోవడానికి రైతులు అనేక కష్టాలు అనుభవిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం కొంత పంటను కొనుగోలు చేసినా, మిగిలిన కొంత పంటను రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని సంబందిత అధికారులు చెప్పుతున్నా కానీ పొద్దీ తిరుగుడును కొనుగోలు చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి రాలేదు అంటున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులు ఎన్ని రోజులు గడుపాలి అని ప్రశ్నించారు. వాతావరణ పరిస్థితిల వలన రైతులు ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయి కాబట్టి రైతులు నష్ట పోకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిది కాబట్టి కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లును వేగవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి పట్టణ అధ్యక్షులు అన్వర్ పాషా, సీనియర్ నాయకులు వంగ వెంకట్రామ్ రెడ్డి, బండి రమణ రెడ్డి, అలుమల్ల ప్రభాకర్ రెడ్డి, మేకల వికాస్ యాదవ్, బూర వెంకన్న గౌడ్, గడ్డం సదానందం, దొంతరబోయిన శ్రీనివాస్, బోడ శ్రీనివాస్, గోపగోని అరవింద్ పాల్గొన్నారు.



# పోషణ పక్వడ- పోషణ పక్షం

**(మదు, ప్రజాతీర్పు సూర్యాపేట) ఏప్రిల్ /23**

పోషణ పక్వాడ పోషణ పక్షంలో భాగంగా సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం గుడుగుండ్ల పాలెం రైతు వేదిక నందు మండల పరిధిలోని వివిధ గ్రామాల అంగన్వాడి సెంటర్స్ తో కలిసి గురువారం సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని డిడబ్ల్యూఓ ఐసిడిఎస్,హుజూర్ నగర్ ప్రాజెక్టు వారి నిర్వహించిన ఈ పోషణ పక్షంలో సిడిపిఓ సూపర్వైజర్ సీమా తశ్రీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సులో చిన్నారులలో పోషణ వారికి మెరుగైన ప్రీస్కూల్ ఆటపాటలతో నిర్వహించి టిఎల్ఎం మెటీరియల్ మరియు తల్లిదండ్రులు చిన్నారులకు సెల్ ఫోను ను సాధ్యమైనంత దూరంగా ఉంచాలని,బరువులు వారి బరువులు యొక్క ప్రమాణిత నిర్దేశం గర్భిణీలకు మెరుగైన సమతుల్య ఆహారం ఇవ్వటం ఐసిడిఎస్ యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూఓ నరసింహ,సిడిపిఓ లిఖిత పోషణ కోఆర్డినేటర్ రాజేష్ ఐసిడిఎస్ సూపర్వైజర్ సీమ తశ్రీన్ గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్,మండల సమైక్య రాధిక ఏపీఎం రామలక్ష్మి ఎల్ఎంపిహెచ్ విద్య ఏఎన్ఎం రాంబాయి మండల పరిధిలోని వివిధ గ్రామాల అంగన్వాడి టీచర్లు ఆయాలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎన్ సిడి స్క్రీనింగ్ అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా పగడ్బందీగా నిర్వహించాలి

- వైద్యశాఖ అధికారులు అలసత్వంపై అగ్రహాము
- జిల్లా కలెక్టర్ కే.హైమావతి,,,

**సిద్దిపేట, ఏప్రిల్ 23 (ప్రజాతీర్పు)**



గురువారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్యులు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించి జిల్లాలో నిర్వహించిన ఎన్సీడీ స్క్రీనింగ్ టెస్టులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణ దృష్టిలో పెట్టుకొని ప్రజల ఆరోగ్య పరిస్థితిలను తెలుసుకుంటే వారికి సమయానికి అందించాల్సిన వైద్య సహాయం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఎన్సీడీ స్క్రీనింగ్ చేసి వ్యక్తిగత హెల్త్ ప్రొఫైల్ ను సిద్ధం చేస్తుందని అన్నారు. ఎన్ సిడి స్క్రీనింగ్ ద్వారా బీపీ, షుగర్, తోపాటుగా ఓరల్ క్యాన్సర్ టెస్ట్, బ్రెస్ట్ మరియు సర్వైకల్ క్యాన్సర్ టెస్ట్ చేసి గుర్తించిన వారికి అవసరమైన వైద్య సేవలు క్రమం తప్పకుండా వైద్యాధికారులు అందించాల్సి ఉంటుందని అన్నారు. కానీ జిల్లాలో చేపట్టిన ఎన్సీడీ స్క్రీనింగ్ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తు వైద్యశాఖ అధికారులు అలసత్వం ప్రదర్శించి అందరికి వైద్య పరీక్షలు నిర్వహించకుండ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపటినుండి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని సెంటర్ ల వారిగా వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి ఎన్సీడీ స్క్రీనింగ్ చేసి పీహెచ్సీ వైద్యాధికారి లాగిన్ ద్వారా వివరాలను ఆన్లైన్లో పొందుపరచాలని, మరొకసారి అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్, ఎన్ సిడి ప్రోగ్రాం ఆఫీసర్, అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వైద్యులు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ విశ్వతేజ స్కూల్‌లో 5వ తరగతి నుంచి 6వ తరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ సంబరాలు

శ్రీ విశ్వతేజ స్కూల్ కరస్పాండెంట్ బుర్ర శ్రీనివాసరావు

**(మదు,ప్రజాతీర్పు సూర్యాపేట)ఏప్రిల్ /23**

హుజూర్ నగర్ పట్టణంలోని శ్రీ విశ్వతేజ స్కూల్లో ఆధ్వర్యంలో ఐదవ తరగతి పూర్తి చేసి ఆరో తరగతిలోకి అడుగుపెడుతున్న చిన్నారుల కోసం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుక నిర్వహించబడింది. ఈ కార్యక్రమం పాఠశాల ఆవరణలో ఉత్సాహభరిత వాతావరణంలో,విద్యార్థులు,ఉపాధ్యాయులు, సమక్షంలో ఎంతో ఆనందంగా జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులు తమ విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని విజయవంతంగా పూర్తి చేసిన ఆనందాన్ని పంచుకున్నారు. కరస్పాండెంట్ బుర్ర శ్రీనివాసరావు విద్యార్థులను అభినందిస్తూ,వారి భవిష్యత్ విద్యా జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఊర్మిళ మేడం మాట్లాడుతూ ఈ చిన్నారులలో ఉన్న ప్రతిభ,క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. ఆరో తరగతిలోకి అడుగుపెడుతున్న ఈ విద్యార్థులు మరింత ఉన్నతంగా రాణించాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమం చివరలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయబడి,మధుర జ్ఞాపకంగా నిలిచింది. ఈ గ్రాడ్యుయేషన్ డే వేడుక చిన్నారుల జీవితంలో ఒక చిరస్మరణీయ ఘట్టంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పాఠశాల టీచర్స్ టి జ్యోతి,ఎస్.కె మనిషా,నర్మదా,సౌజన్య,రమాదేవి,పూజ,మౌనిక,సింధు,మౌనిక,అనూష మరియు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.



# అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు అందేలా జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ బాధ్యత

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**(మదు, ప్రజాతీర్పు సూర్యాపేట) ఏప్రిల్ 23**

అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు వచ్చేలా చూడాల్సిన బాధ్యత జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ పై ఉందని,అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడిటేషన్ కార్డు త్వరలో అందజేస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం తన చాంబర్లో జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే గురుతర బాధ్యత పత్రికలు,చానళ్లపై ఉందని,అలాంటి విధులు నిర్వహించే జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చే గుర్తింపు కార్డులు అర్హత ఉన్న వారికి అందాలని,ఆ విధంగా జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫిబ్రవరి 24వ తేదీ శుక్రవారం సాయంత్రంలోగా దరఖాస్తు చేయని పాత్రికేయులు వెంటనే తమ దరఖాస్తులను ఆన్లైన్లో దరఖాస్తు చేయాలని కలెక్టర్ సూచించారు. నూతనంగా ఎంపికైన అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు చలసాని శ్రీనివాసరావు, వజ్జే వీరయ్య, షేక్ సైదా,కోల నాగేశ్వరరావు,ఎండి. ఖలీల్ అహ్మద్,డాక్టర్ బంటు కృష్ణ,రెబ్బ విజయకుమార్,శంకర్ మంచి రవీందర్ శర్మ, బత్తుల మల్లికార్జున్,బుక్క ఉపేందర్ లకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ కు పుష్పగుచ్చం అందజేసి శాలువ సమర్పించారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుచరిత,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ దర్శనం మల్లేశం,జిల్లా పౌర సంబంధాల అధికారి వల్లోజి శ్రీనివాసరావు ఉన్నారు.

# కండక్టర్ల చేతివాటం... ఉచిత ప్రయాణం అంటూ డబ్బు వసూలు

**హుస్నాబాద్, ఏప్రిల్ 23 (ప్రజాతీర్పు)**



బుధవారం నుండి ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతున్నది. దీంతో తాత్కాలిక పద్ధతిన ఆర్టీసీలో కండక్టర్లుగా చేస్తున్న వారు టికెట్లను చేతివాటం ప్రదర్శిస్తున్నారు. గురువారం ఉదయం వరంగల్ డిపోకు చెందిన ప్రైవేటు ఆర్టీసీ బస్సులో పదిమంది ప్రయాణికులు హుస్నాబాద్ కు వస్తున్న క్రమంలో వీరికి ఉచిత బస్సు ప్రయాణం మహాలక్ష్మి పథకం కింద అంటూనే పదిమంది ప్రయాణికులకు టికెట్ ఇచ్చి రూ.50 చొప్పున రూ.500 వసూలు చేశాడు కండక్టర్. హుస్నాబాద్ కు చేరుకున్న తర్వాత టికెట్టుపై జీరో రూపాయలు అని ఉన్నప్పటికీ మీరు డబ్బులు ఎందుకు తీసుకున్నారు అని సదానందం అనే ప్రయాణికుడు ప్రశ్నించాడు. దీంతో సదరు కండక్టర్ పైనుండి మాకు ఇలానే ఆదేశాలు వచ్చాయి అని సమాధానం చెప్పాడు. అలాగే కొత్తగా డ్యూటీ చేస్తున్నాను కాబట్టి మాకు తెలియదు అంటూ దాటవేసే ప్రయత్నం చేశాడు. చివరికి సదరు ప్రయాణికుడు హనుమకొండ డిఎం కు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పాడు. దీంతో ఆ కండక్టర్ పై చర్యలు తీసుకుంటామని డి ఎం చెప్పడం గమనార్హం. ఇలా కండక్టర్లు చేతివాటం ప్రదర్శిస్తూ టికెట్ల పేరుతో డబ్బులు వసూలు చేస్తూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు అని మండిపడ్డారు. ఆర్టీసీ అధికారులు, కండక్టర్లు కుమ్మక్కై ఈ తతంగానికి పాల్పడుతున్నారని ప్రయాణికులు అనుకోవడం గమనించదగ్గ విషయం.

# భగీరథ మహర్షి త్యాగం, పట్టుదల ప్రతి ఒక్కరికీ ఆదర్శం -- కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, ఏప్రిల్ 23 (ప్రజా తీర్పు ):**



గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరై, జ్యోతి ప్రజ్వలన గావించి, మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సగర వంశీయులైన భగీరథ మహర్షి గంగా నదిని స్వర్గం నుంచి భూమిపైకి తీసుకువచ్చిన గొప్ప తపస్వి అని కొనియాడారు. భగీరథ మహర్షి పట్టుదల, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కలెక్టర్ పేర్కొన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి గంగానదిని భూమికి తెచ్చిన మహనీయుడిగా భగీరథుని చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. అందుకే గొప్ప ప్రయత్నాలను 'భగీరథ ప్రయత్నం'గా పిలుస్తారని వివరించారు. అనంతరం అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, కార్యదర్శులు, అధ్యక్షులు, తదితరులు ఆయన చిత్రపటానికి అంజలి ఘటించి, నివాళులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ జోజి, డిపిఓ యాదయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో యూనస్, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి గంగా కిషన్, సంఘ నాయకులు జిల్లా అధ్యక్షుడు సాయిలు ఉప్పల సాగర సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మె న్యాయమైనది

- అధికారం లోకి రావడానికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి :హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్

**హుస్నాబాద్, ఏప్రిల్ 23 (ప్రజాతీర్పు)**



ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా హుస్నాబాద్ మాజీ శాసన సభ్యుడు వొడితల సతీష్‌కుమార్ హాజరై కార్మికులకు సంఘీభావం తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికులకు న్యాయం చేయాలని, వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా కార్మికులను అణచివేయడం, కూర్చోవడానికి వేసిన తార్పాలిన్‌లు తొలగించడం సరైంది కాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వం లోకి రాకముందు ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా మాట్లాడిన వీడియోను విలేకరుల ముందు ప్రదర్శిస్తూ, ఇప్పుడు అధికారంలో ఉన్నందున అదే హామీలను అమలు చేయాలని కోరారు. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ప్రైవేటీకరణకు అవకాశం కల్పించడం సరైంది కాదని విమర్శించారు. గత ప్రభుత్వం ప్రారంభించిన విలీన ప్రక్రియను పూర్తి చేయాలని, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని అన్నారు. కార్మికుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తాను వ్యక్తిగతంగా, బీఆర్ఎస్ పార్టీ తరఫున పూర్తి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఆర్టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# భగీరథ మహర్షి సంకల్పం నేటి తరానికి ఆదర్శం

- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, ఏప్రిల్ 23 (ప్రజాతీర్పు)**

శ్రీ సగర భగీరథ మహర్షి పట్టుదల, సంకల్పం నేటి తరానికి ఆదర్శమని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఉన్నతాధికారులు సగర సంఘం నాయకులతో కలిసి భగీరథ మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో సగర సంఘం నాయకులు మాట్లాడుతూ తాము అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నామని ప్రభుత్వం చేయూత అందించాలని కోరారు. తమ కులస్తులు పూర్వకాలం నుంచి భవన నిర్మాణ రంగంలో కూలీలుగా పని చేస్తున్నారన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు అందించి ప్రస్తుతం కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల బాధ్యత మాకే అప్పగించాలని విన్నవించారు. తమకు లేబర్ కార్డులు జారీలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. మా సంఘ భవనం నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలన్నారు. తమను బీసీ- డీ నుంచి బీసీ- ఏ లో చేర్చాలని విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సగర కులస్తులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం తరపున అందించే విద్య, స్కాలర్షిప్, విద్యాలయాల్లో సీట్లు, అందించే రుణాలపై సగర సంఘం నాయకులకు అవగాహన కల్పించాలని బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్ ను ఆదేశించారు. త్వరలో అధికారులు సంఘం సభ్యులతో



స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం పై అవగాహన సమావేశం ఏర్పాటు చేస్తారని వివరించారు. లేబర్ కార్డుల జారీలో ఇబ్బందులు లేకుండా, లేబర్ కార్డుల ప్రయోజనాల అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. పంచాయితీ రాజ్, కార్మిక శాఖ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తారని వివరించారు. అంతకుముందు కలెక్టర్ కు సగర సంఘం నాయకులు భగీరథ మహర్షి చిత్రపటం బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జడ్పీ సీఈవో శ్రీనివాస్ , సగర సంఘం జిల్లా అధ్యక్షుడు దేవుని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కట్ట రాజు, కోశాధికారి కుమారస్వామి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్, రాష్ట్ర కార్యనిర్వహక సభ్యులు జ్యోతి మల్లయ్య, హుజురాబాద్ అధ్యక్షులు యంజాల వాసు, నాయకులు కట్ట శ్రీనివాస్, గుంటి రాజయ్య, నులుబాల వేణుగోపాల్, గుంటి తిరుపతి, కురుమండ్ల మల్లయ్య, బోడిపల్లి కుమార, బోడిపల్లి భాగ్య, గుంతి ఈశ్వరమ్మ, కోమల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ టీ సీ కార్మికుల పై ప్రభుత్వ దమన కాండ నశించాలి

- ఆర్టీసీ సమ్మెకు సీపీఎం పూర్తి మద్దతు
- జిల్లా కార్యదర్శి కె నర్సమ్మ

**మెదక్, ఏప్రిల్ 23 (ప్రజా తీర్పు ):**



ఆర్ టీ సీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును సీపీఎం మెదక్ జిల్లా కమిటీ పూర్తిగా ఖండిస్తున్నది. ఆర్ టీ సీ కార్మికుల సమ్మెకు మద్దతు గా గురువారం కార్మికుల ర్యాలీ నిర్వహిం చడాన్ని , వారి సమ్మెకు మద్దతు ఇవ్వడానికి వెళ్ళిన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి కె నర్సమ్మ ను,పోరాట కార్మిక సంఘం అయిన సి ఐ టీ యు జిల్లా కార్యదర్శి ఏ మల్లేశం ను పోలీసులు అక్రమంగా అరెస్టులు చేసి వెల్దుర్తి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కె నర్సమ్మ మాట్లాడుతూ ఎన్నికల కంటే ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మేము కాంగ్రెస్ ప్రభుత్వం గనక అధికారం లోకి వస్తె ఆర్ టీ సీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆర్ టీ సీ కార్మికులు సమ్మె చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న ఆర్ టీ సీ ని ప్రభుత్వంలో చేయడం లేదని అన్నారు .ఆర్ టీ సీ లో ఉన్న బిబిబిఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా ఉన్న ఆర్టీసీ సిబ్బంది తోనే రోజుకు 18 గంటలు పని చేయించుకుంటున్నారు. రిటైర్డ్ అయిన వారి స్థానంలో కోతా రిక్రూట్ మెంటు లేక డ్రైవర్,కండక్టర్ ఎక్కువ గంటలు డ్యూటీలు చేయాలంటే భయపడు తున్నారన్నారు. వారికి అత్యవసర ,వీక్లీ ఆఫ్ లు కూడా ఇవ్వకుండా డ్యూటీలు చేస్తున్న వారి ఆరోగ్యాలు దెబ్బ తింటున్నాయన్నారు. ఆర్ టీ సీ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వాన్నీ కోరారని గొంతెమ్మ కోర్కెలు కోరలేదని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తామని చెప్పిన పెండింగులో ఉన్న 2 డీ ఏ, 2పీ ఆర్ సీ లను వెంటనే చెల్లించాలని, ఆర్ టీ సీ నీ ప్రభుత్వంలో విలీనం చేయాలని, రిటైడ్ అయిన వారి పెండింగు బిల్లులు చెల్లించాలని,ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని తదితర 32 డిమాండ్లను పరిష్కరించాలని కార్మికులు కోరడం అన్యాయం ఎలా అవుతుందని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ప్ర ఆర్ టీ సీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుండా సమ్మె చేస్తున్న కార్మికులను,కార్మిక సంఘాల ను,సమ్మెకు మద్దతు ఇవ్వడానికి వెళ్ళిన సిపిఎం పార్టీ లను అరెస్టులు చేసి అత్యంత దుర్మార్గం గా మెదక్ జిల్లా కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరం లో ఉన్న వెల్దుర్తి మండలం పోలీస్ స్టేషన్ కు తరలించడం లో ఉన్న ఉద్దేశ్యం ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు,కార్మిక సంఘాల నాయకులు, పార్టీ నాయకుల పట్ల ప్రభుత్వం ఉగ్రవాదుల ను చూసినట్టుగా భావిస్తుందన్నారు. కార్మికుల సమ్మెలు,పోరాటాలు ప్రభుత్వం అరెస్టుల తో ఆపలేవనీ ,పోరాటాను అణచడానికి ప్రభుత్వం ఎన్ని రకాలుగా ప్రయత్నించిన చివరకు కార్మికులు,కార్మిక సంఘాలు,కార్మిక పార్టీ లే విజయం సాధిస్థాయిని ప్రభుత్వానికి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి ఏ మల్లేశం ఉన్నారు.



# బస్టాండ్ల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్త్

- ఆర్టీసీ సేవలు అంతరాయం లేకుండా కొనసాగాలి
- ఎస్పీ. డి . వి. శ్రీనివాస రావు ఐపీఎస్

**మెదక్, ఏప్రిల్ 23 (ప్రజా తీర్పు ):**

టీజీఎస్ఆర్టీసీ జేఏసీ సమ్మె నేపథ్యంలో మెదక్ జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ప్రజా రవాణా సేవలు నిరంతరంగా కొనసాగేందుకు భద్రతా చర్యలను బలోపేతం చేసింది. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. డిపో మేనేజర్ సురేఖతో మాట్లాడిన ఎస్పీ, ప్రస్తుతం నడుస్తున్న బస్సుల సంఖ్య, సేవల స్థితిగతులను తెలుసుకున్నారు. సమ్మె ఉన్నప్పటికీ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా రవాణా సేవలు సజావుగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బస్టాండ్ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రైవేట్ డ్రైవర్లు, సిబ్బంది భయపడాల్సిన అవసరం లేదని, వారికి పూర్తి భద్రత కల్పిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. ప్రజా రవాణాకు ఆటంకం కలిగించే చర్యలు, బస్సులకు నష్టం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసాన్ని సహించబోమని హెచ్చరించారు. అటువంటి ఘటనలు జరిగితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలని, అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంట డియస్పీ ప్రసన్న కుమార్, డిపో మేనేజర్ సురేఖ, సీఐలు మహేష్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్క్లాసికో ఏకపక్షం.. ముంబైపై చెన్నై ఘనవిజయం

ఐపీఎల్లో ఐదుసార్లు చాంపియన్లు చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్కే), ముంబై ఇండియన్స్ మధ్య వాంఖడేలో గురువారం జరిగిన పోరులో సీఎస్కేనే విజయం వరించింది. క్రికెట్ అభిమానులు 'ఎల్క్లాసికో'గా పిలుచుకునే ఈ పోరును చెన్నై మొదట బ్యాట్తో తర్వాత బంతితో సత్తాచాటి పూర్తిగా ఏకపక్షంగా మార్చేసింది. సీఎస్కే నిర్దేశించిన 208 పరుగుల ఛేదనలో స్పిన్నర్లు అకీల్ హోసేన్ (4/17) నాలుగు వికెట్ల ప్రదర్శనకు తోడు నూర్ అహ్మద్ (2/23) స్పిన్ మాయాజాలానికి విలవిల్లాడిన ముంబై.. 19 ఓవర్లలో 104 పరుగులకు కుప్పకూలింది. దీంతో103 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన చెన్నై ఐదో స్థానానికి ఎగబాకగా, ముంబై ఐదో ఓటమితో ఎనిమిదో స్థానంలో ఉంది. తిలక్ వర్మ (37), సూర్యకుమార్ (36) మినహా మిగిలినవారంతా సింగిల్ డిజిట్కే పరిమితమయ్యారు.



# పదవిలో ఉన్నంత కాలం ఇంటి టాక్స్ ఇబ్బందులు ఉండవు

సర్పంచ్ వినోద్ రాథోడ్

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) ప్రిల్.23**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పడమటి తండా గ్రామా సర్పంచ్ వినోద్ రాథోడ్ మాట్లాడుతూ,, ఎన్నికలలో హామీలో భాగంగా నేను ఇచ్చిన మాట ప్రకారం పడమటి తండా మరియు ఎన్టీఆర్ తండా ప్రజలకు ఐదు సంవత్సరాల వరకు ఇంటి టాక్స్ పూర్తిగా కడతానని ఎన్నికలలో హామీ ఇవ్వడం జరిగింది అదేవిధంగా ఈ సంవత్సరం గాను రెండు లక్షల 25 వేల రూపాయలను మొదటి సంవత్సరంలో చెల్లించడం జరిగింది అదేవిధంగా పదవిలో ఉన్నంతకాలం గ్రామ ప్రజలకు ఇంటి టాక్స్ విముక్తి ఉంటుందని తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమంలో... గ్రామ సర్పంచ్ కాట్రావత్ వినోద్ రాథోడ్ ,ఉప సర్పంచ్ రాజు నాయక్, వార్డు సభ్యులు శ్రీను,బాబు లాల్,సేవ్య, రమేష్ నాయక్, బుజ్జి,లక్ష్మణ్, సురేష్, భాస్కర్, మోహన్,హరిచంద్, శ్రీకాంత్, మధు, మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శి దివాకర్ మరియు గ్రామ సిబ్బంది పాల్గొన్నారు



## కలెక్టరేట్లో ఘనంగా మహర్షి భగీరథ జయంతి వేడుకలు

**నిర్మల్,ఏప్రిల్ 23 (ప్రజాతీర్పు )**

కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గురువారం, భగీరథ మహర్షి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా పలువురు అధికారులు, నాయకులు భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు మాట్లాడుతూ, మహర్షి భగీరథ మహర్షి గొప్పతనం, విశేషాలను వివరించారు. ఈ జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎల్డిఎం రామ్ గోపాల్, పలువురు సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది,పాల్గొన్నారు.



## కె. ఎల్ . ఆర్. జన్మదిన సందర్భంగా బస్తీ పిల్లలతో ఇంటిల్లి పాది పండుగగా జరుపుకున్న షర్మిల కాలేష

**(వై యాదగిరి, ప్రజాతీర్పు రిపోర్టర్) ఏప్రిల్ 23**

కీసర సర్కిల్, జవహర్ నగర్ జిహెచ్ఎంసి పరిధిలో గల బడుగు బలహీన వర్గాల, ఆశాజ్యోతి ప్రియతమ నాయకులు, మేడ్చల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, ప్రస్తుతం మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మరియు సామాజిక స్పృహ కలిగిన మహోన్నతమైన వ్యక్తి శ్రీ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి 70 వ జన్మదిన టీ కాలేష, షర్మిల దంపతులు, బస్తి పిల్లల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. జవహర్ నగర్ ముస్లిం కమిటీ కార్యదర్శి మరియు కాంగ్రెస్ (ఐ) పార్టీ నాయకులు టీ కాలేష, అతని సతీమణి షర్మిల ఆధ్వర్యంలో పిల్లలకి పండ్లు, పలహారాలు పంపిణీ చేశారు. కేక్ కట్ చేయించి, కె. ఎల్ .ఆర్ కు 70 వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కె. ఎల్. ఆర్ ఆయు ఆరోగ్యాలతో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని హాజరైన పిల్లలు దేవుళ్ళతో సమానమని పిల్లల సంతోషం ఆ చిరునవ్వులు దేవుళ్ళ దీవెనలు గా గుర్తు చేసుకున్నారు . ది :23-04-2026 గురువారం రోజున స్థానిక జవహర్ నగర్ జిహెచ్ఎంసి సుక్కమ్మ బస్తీలోని తమ నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. మృదు స్వభావి, స్నేహశీలి, పీడిత వర్గాల ఆశాజ్యోతి కె. ఎల్ .ఆర్ .కష్టించే వాడికే తినే హక్కు ఉంటుందనే కె.ఎల్.ఆర్ ఆలోచనకు అభిమానిగా మారానని అందుకే ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఆయన పుట్టినరోజును తన కుటుంబ సభ్యులతో జరుపుకోవడం ఆనవాయితీగా మారిందని ఈరోజు తమ ఇంటిల్లి పాదికి పండుగ రోజు అని టీ కాలేష గుర్తు చేశారు. ఆయన రాజకీయంగా మరింత ఎత్తుకు ఎదగాలని కోరారు. మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండేటట్లు ప్రజల ఆదరణ అభిమానం వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు.

## ఆర్టీసీ సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు

కొండు బానే ష్, సిపిఐ తాండూర్, మండల కార్యదర్శి

**(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి) ఏప్రిల్ 23**



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రోజురోజుకీ ఆర్టీసీ కార్మికుల సమస్యలు తీవ్రమవుతున్న నేపథ్యంలో, వారి పరిస్థితిలోని ప్రజల కు మరియు ప్రభుత్వానికి తెలియజేయడం అత్యవసరమైంది, ఆర్టీసీ కార్మికులు రాష్ట్ర ప్రజలకు నిరంతర సేవలు అందిస్తూ, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు రవాణా సదుపాయాలను కల్పిస్తూ కీలక వర్గం అయితే, వారి సేవలకు తగిన గుర్తింపు, భద్రత సౌకర్యాలు అందడం లేదు చాలామంది ఉద్యోగులకు జీతాలు ఆలస్యంగా చెల్లించడం, పెండింగులు పేరుకుపోవడం, ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో పోలిస్తే తక్కువ వేతనాలు ఇవ్వడం వంటి సమస్యలు ఉన్నాయి, పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకుని జీతాలను సవరించాల్సిన అవసరం ఉందని, కాంట్రాక్టు మరియుఔట్ సోర్సింగ్ విధానాలు పెరగడం వల్ల శాశ్వత ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయని, డ్రైవర్లు, కండక్టర్లు రోజుకు ఎక్కువ గంటలు పని చేయాల్సి వస్తోంది, సరైన విశ్రాంతి లేకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు మరియు రోడ్డు ప్రమాదాల అవకాశాలు పెరుగుతున్నాయని, అదేవిధంగా పెన్షన్, వైద్య సేవలు, బీమా వంటి ప్రాథమిక సదుపాయాలు సరైన విధంగా అందడం లేదు, ఉద్యోగులు రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక భద్రత లేక ఇబ్బందులు పడుతున్నారని, ఆర్టీసీ పై భారీ అప్పులు ఉండటం, సంస్థను బలహీన పరుస్తున్నాయని అయితే, ఈ భారాన్ని ఉద్యోగులపై మోపడం అన్యాయమని, ప్రైవేట్ సంస్థలకు రూట్లు ఇవ్వడం, సేవలను ఔట్ సోర్స్ చేయడం వంటి చర్యలు ఆర్టీసీ భవిష్యత్తుపై అనిశ్చి తిని పెంచుతున్నాయి, ఇది ప్రజా రవాణా వ్యవస్థను బలహీనపరిచే ప్రమాదం ఉంది,

# ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, ఏప్రిల్ 23 (ప్రజాతీర్పు )**

ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సంక్షేమ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్మల్ గ్రామీణ మండలం, డ్యాంగాపూర్ ప్రభుత్వ బాలుర ఆశ్రమం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల, పోషకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్ కు అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ముందుగా పాఠశాలలోని సరస్వతి అమ్మవారి విగ్రహానికి కలెక్టర్, అధికారులు, పోషకులు కలిసి పూజలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సంక్షేమ వారోత్సవాలు నిర్వహించుకుంటున్నామని అన్నారు. పోషకులు, తల్లిదండ్రుల సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ సమావేశాల వల్లనే పాఠశాల ప్రగతి ఆధారపడి ఉంటుందన్నారు. విద్యార్థుల ప్రగతి వివరాలు కూడా ఈ సమావేశాల వల్ల తల్లిదండ్రులకు తెలుస్తాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలవడం వల్ల పాఠశాల విద్యార్థుల సమస్యల



పరిష్కారానికి ఆస్కారం ఉంటుందన్నారు. విద్యార్థులు అందరూ సెలవులు ముగియగానే సమయానికి పాఠశాలకు రావాలని అన్నారు. తల్లిదండ్రులు ఈ విషయంలో చొరవ చూపాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రహరీ గోడ సమస్య తొలగిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల నీటి సౌకర్యానికై బోరు వేస్తామని చెప్పారు. ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు అన్ని నైపుణ్యాలు, అర్హతలు ఉన్న ఉపాధ్యాయులతో విద్యాబోధన అందించ బడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని వివరించారు. కామన్ మెనూ ప్రకారం విద్యార్థుల కు భోజనం అం దిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న పిల్లలందరూ చదువులు, ఆటల్లో అద్భుత ప్రతిభ చాటు తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులకు వార్షిక ప్రగతి నివేదికలు అందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన, క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులను శాలువాలతో సత్కరించి, బహుమతులు, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్ర మంలో డిటిడిఓ అంబాజీ, డీఈవో భోజన్న, సిపిఓ జీవ రత్నం, తహసిల్దార్ ప్రభాకర్, ప్రధానోపాధ్యాయురాలు శైలజ, గ్రామసర్పంచ్, ఉప సర్పంచ్ లు నవీన్, హరీష్, ఇతర అధికారులు, విద్యార్థుల పోషకులు, తదితరులు పాల్గొన్నారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020